డా॥ వై.ఎస్.ఆర్.

# రైతు భరోసా

వ్యవసాయ, ఉద్యాన, మరియు పట్టు పరిశ్రమ రైతుల సచిత్ర మాస పత్రిక

సంపుటి-04 సంచిక-01 జులై - 2023 పేజీలు - 44

నాల్గవ వార్షికోత్సవ శుభాకాంక్షలతో....



ప్రతి అడుగులోను రైతులకు తోడుగా...

# విత్తనాలు కొంటున్నారా.... ఇవి తెలుసుకోండి...

**01** విత్తన లైసెన్సు కలిగిన విత్తన విక్రయాదారుల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలి. విక్రయదారుని సంతకంతో రశీదులు తప్పక తీసుకోవాలి.

**02** సంబంధిత రశీదులను, కొనుగోలు చేసిన విత్తన సంచులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచాలి. మొలక సరిగా రాకపోయినా, పూత-కాత సమయంలో తేడాలున్నా సంబంధిత విక్రయదారు/కంపెనీ నుంచి నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుంది.

**03** బి.టి. కాటన్, మిరప హైబ్రిడ్ విత్తనాలను తెలియని, నమ్మదగని వ్యక్తులు, అనుమతిలేని కంపెనీల నుంచి కొనుగోలు చేసి నష్టపోవద్దు. విత్తన సంచిపై వివరాలు తెలుసుకోవాలి. గడువు ముగిసిన, తక్కువ బరువున్న విత్తన ప్యాకెట్లను కొనుగోలు చేయరాదు

**04** విత్తేముందు మొలకశాతాన్ని పరీక్షించుకోవాలి. సరిగా లేనిచో విక్రయదారు నుంచి వేరే విత్తనాన్ని పొందవచ్చు. విత్తన తరగతిని బట్టి విత్తన సంచులకు ట్యాగ్స్ కట్టి ఉంటాయి. గమనించండి.

**05**
బ్రీడర్ (ప్రజననదారుడు) విత్తనం - పసుపు రంగు
ఫౌండేషన్ (మూల/పునాది) విత్తనం - తెలుపురంగు
సర్టిఫైడ్ (ధృవీకరించిన) విత్తనం - నీలి రంగు
ట్రూత్‌ఫుల్ లేబుల్డ్ (నమ్మదగిన) విత్తనం - ఆకుపచ్చరంగు

రైతుభరోసా కేంద్రాల్లో ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలు లభ్యమవుతున్నాయి.

-డా. బి. వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్త, ఐసిసి, గన్నవరం









ప్రధాన సంపాదకులు

**శ్రీ చేవూరు హరికిరణ్,** ఐ.ఏ.ఎస్.

వ్యవసాయ స్పెషల్ కమీషనర్



సంపాదకులు

**శ్రీ వల్లూరి శ్రీధర్**

జాయింట్ డైరెక్టర్, ఆర్.బి.కె.

కార్యనిర్వాహక సంపాదకులు

**శ్రీ వి. హరగోపాలరాజు**

సహాయ సంపాదకులు

**శ్రీ ఎన్.సి.హెచ్. బాలు నాయక్,** డిడిఎ

**శ్రీ డి. వెంకటేశ్వర్లు,** డిడిఎ

**డా॥ బి.ఎస్. శ్రీనివాసాచార్యులు,** ఏడిఎ

**శ్రీ జె. వెంకటరావు,** ఎడిఎ

**శ్రీ కె. ఆంజనేయ కుమార్,** ఎఒ



*రచనలు పంపాల్సిన చిరునామా :*

వ్యవసాయ కమీషనర్ వారి కార్యాలయం

చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు

E-mail : mediaproductionap@gmail.com



డా. వైఎస్ఆర్ రైతు భరోసా సంచిక డిజిటల్ ఎడిషన్ apagrisnet.gov.in అందుబాటులో ఉంది


## విషయసూచిక

జులై - 2023

**సంపాదకీయం**




| | | |
|---|---|---|
| 1. | ప్రతి అడుగులోనూ రైతులకు తోడుగా | 5 |
| 2. | కిసాన్ జి.పి.టి. | 7 |
| 3. | రైతు సేవలో - ఒంగోలు జీవ నియంత్రణ ప్రయోగశాల | 9 |
| 4. | వేరుశనగ సాగు ఇలా... | 10 |
| 5. | వరికి ప్రత్యామ్నాయంగా ఊద | 12 |
| 6. | ఊదలతో నోరూరించే వంటకాలు | 14 |
| 7. | ఆముదం-రకాలు | 15 |
| 8. | వరిలో కలుపు - ఎరువుల యాజమాన్యం | 16 |
| 9. | ప్రత్తిలో సకాలంలో కలుపు నివారణ | 18 |
| 10. | వాణిజ్య సరళిలో గులాబీ | 20 |
| 11. | ప్రత్యామ్నాయ పంటగా ఉలవ | 22 |
| 12. | చిత్రమాలిక | 23 |
| 13. | అన్ని కాలాలకు అనుకూలం టమాట | 24 |
| 14. | అన్ని నేలలకు అనువైన బెండ | 26 |
| 15. | ముల్లంగి స్వల్పకాలం - అధిక లాభం | 28 |
| 16. | జామలో కొమ్మ కత్తిరింపులు | 30 |
| 17. | తరాలుగా తరగని కల్పవృక్షం | 32 |
| 18. | ఏడాదంతా సాగుచేసే ప్రొద్దుతిరుగుడు | 34 |
| 19. | గోదావరి జిల్లాలో మిరియాల సాగు | 36 |
| 20. | రైతుల సందేహాలు - సమాధానాలు | 37 |
| 21. | సందేహాలు - సమాధానాలు | 39 |
| 22. | సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు | 41 |
| 23. | సమీకృత రైతు సమాచార కేంద్రంపై రైతుల స్పందన | 42 |









డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా సచిత్ర మాసపత్రిక సంవత్సర చందా - రూ.300/-
యూనియన్ బ్యాంక్, గోరంట్ల శాఖ ఖాతా నెం. **069610100200430** కు నేరుగా గూగుల్ పే, ఫోన్ పే ద్వారా పంపవచ్చు. డి.డి.లు పంపాల్సిన చిరునామా : ది ఎడిటర్, డా. వై.ఎస్.ఆర్. రైతు భరోసా మాసపత్రిక, వ్యవసాయ కమీషనర్ కార్యాలయం చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు




సంపాదకీయం

# మరింత చేరువగా యంత్ర సేవ

కోటి ఆశలతో కొత్త ఖరీఫ్ పంట కాలం ప్రారంభించిన రైతుకు ప్రభుత్వం వెచ్చని వడగాడ్పుల్లో చల్లని గాలి తెమ్మెరలా రైతు భరోసా సాయం అందించింది. అంతే కాకుండా వేసవి తొలి మాసాల్లో వరుసగా కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసి మళ్ళీ పంటల సాగుకు కావాల్సిన మనోధైర్యాన్ని ఇచ్చింది. ఏ సీజన్లో పంట నష్టపోతే ఆ సీజన్ ముగిసేలోగా సాయం చేస్తామన్న మాట నిలబెట్టుకుని రైతు పక్షపాత ప్రభుత్వమని నిరూపించుకుంది. రాష్ట్రంలో రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు తీరుస్తూ చేదోడు వాదోడుగా నిలుస్తున్న రైతు భరోసా కేంద్రాలను పటిష్టం చేసే దిశగా ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ప్రతీ రైతు భరోసా కేంద్రంలో యంత్రసేవ అందుబాటులో ఉండాలన్న లక్ష్యం మేరకు వరుసగా రెండో ఏడాది భారీ యంత్ర సేవ మేళా నిర్వహించి 2,562 ట్రాక్టర్లు రైతు గ్రూపులకు పంపిణీ చేసింది. ఇవే కాకుండా 100 కంబైన్డ్ హార్వెస్టర్లు, 13573 వ్యవసాయ పరికరాలను అందించింది. రూ. 125.48 కోట్ల సబ్సిడీని రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసింది. దీంతో రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాలన్నీ యంత్రసేవ పరిధిలోకి వచ్చినట్టయింది.

ఖరీఫ్ పంటల సాగుకు నైరుతి రుతుపవనాలు ముఖం చాటేస్తుండడంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సిద్ధం చేసింది. కొద్దిగా ఆలస్యమైనా వానలు ఆశాజనకంగా ఉంటాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు రైతులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రణాళికతో రైతును సాగులో ముందుకు నడిపించనుంది.. సాధారణంగా జూన్ లో తొలకరి పలకరించాల్సి ఉన్నా నెల పూర్తయినా వానలు జాడ లేకపోవడంతో సహజంగానే ఆందోళన నెలకొంటోంది. అయితే ప్రభుత్వం రైతులపై ఒత్తిడి తగ్గించేందుకు, పంట నష్టాలు నివారించేందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తల సహకారంతో జిల్లాల వారీ, పంటల వారీ ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ రూపొందించింది.

జులై 15 వరకు వర్షాలు ఆశించినంత పడకుంటే ఏ పంటలు వేయాలి, ఏ వంగడాలు శ్రేయస్కరం అన్న సూచనలను రైతులకు క్షేత్రస్థాయిలో అందించడానికి యంత్రాంగాన్ని సమాయత్తం చేసింది. జూన్ 21 నాటికి 2,46,457 క్వింటాళ్ళ వివిధ రకాల పంటల విత్తనాలను 3,64,880 మంది రైతులకు సబ్సిడీపై 26 జిల్లాల్లో పంపిణీ చేసింది. వీటిలో వేరుశనగ, వరి, రాగి, కొర్ర, మినుము, పిల్లిపెసర లాంటి విత్తనాలు ఉన్నాయి.

# ప్రతి అడుగులోనూ రైతులకు తోడుగా

## వై.ఎస్.ఆర్.యంత్ర సేవా పథకం కింద పరికరాల పంపిణీలో సీఎం జగన్




రైతులు దేశానికి, రాష్ట్రానికి వెన్నెముక. అలాంటి రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. అందుకోసమే రాష్ట్రంలో నాలుగేళ్లుగా వారికి అన్ని విధాలా అండగా నిలిచాం. విత్తనం మొదలు పంట కొనుగోలు వరకు అన్ని దశల్లో వారికి దిశా నిర్దేశం చేస్తూ తీసుకొచ్చిన ఆర్బీకెలు అద్భుత ఫలితాలిస్తున్నాయి. ఈ పరంపరలో భాగంగా రైతులకు అతి తక్కువ అద్దెపై వ్యవసాయ యంత్ర పరికరాలు సమకూరుస్తూ ఇంకో అడుగు ముందుకు వేశాం. అన్నదాతలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. -ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- ప్రతి ఆర్.బి.కె పరిధిలో అందుబాటులో వ్యవసాయ పరికరాలు
- **10,444** ఆర్బీకేల పరిధిలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు
- ఇప్పటికే **6,525** ఆర్.బి.కె, **391** క్లస్టర్ కేంద్రాల స్థాయిలో సేవలు
- **3,800** ట్రాక్టర్లు, **391** కంబైన్డ్ హార్వెస్టర్లు, **22,580** ఇతర యంత్రాలు
- మిగిలిన **3,919** ఆర్.బి.కె, **100** క్లస్టర్ కేంద్రాల స్థాయిలోనూ సేవలు
- వీటిలో **2,562** ట్రాక్టర్లు, **100** కంబైన్డ్ హార్వెస్టర్లు, **13,573** ఇతర విత్తన యంత్ర పరికరాలు
- అక్టోబర్‌లో **7** లక్షల మందికి ఉపయోగపడేలా స్ప్రేయర్లు, టార్పాలిన్లు.

"రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలను అన్ని విధాలా చేయి పట్టుకుని నడిపించడంలో భాగంగా రైతన్నలే ట్రాక్టర్లతో కూడిన వ్యవసాయ పనిముట్లన్నింటినీ అతి తక్కువ అద్దెతో మిగిలిన రైతులకు అందుబాటులోకి తేవడం గ్రామ స్వరాజ్యానికి నిజమైన అర్థం" అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. వై.ఎస్.ఆర్. యంత్ర సేవా పథకంలో భాగంగా జూన్ 2 న ఆయన గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లో రాష్ట్ర స్థాయి రెండో మెగా పంపిణీ కింద 1.9 కోట్ల విలువ గల 2,562 ట్రాక్టర్లు, 100 కంబైన్డ్ హార్వెస్టర్లు, 13,573 ఇతర వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేసే కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ట్రాక్టర్‌ను, కంబైన్డ్ హార్వెస్టర్ ను స్వయంగా నడిపారు. అనంతరం రూ.125.48 కోట్ల సబ్సిడీ సొమ్మును కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా రైతన్నల గ్రూపుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.



**బటన్ నొక్కి సబ్సిడీ సొమ్ము విడుదల**

ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ ప్రతి ఆర్.బి.కె. పరిధిలో ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్ కింద రైతులకు కావాల్సిన ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నామన్నారు. ఆర్బీకే పరిధిలో ఉన్న రైతులే ఒక గ్రూపుగా ఏర్పడి దానిని ఒక కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ కిందకు తీసుకుని వచ్చి, ఆ ఆర్.బి.కె. పరిధిలో ఉన్న మిగిలిన రైతులందరికీ తక్కువ ధరకు ఈ యంత్రాలన్నింటినీ అందుబాటులోకి తీసుకొచ్చే గొప్ప కార్యక్రమానికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. తద్వారా 10,778 ఆర్.బి.కె.ల పరిధిలో రైతులకు ట్రాక్టర్లతో కూడిన వ్యవసాయ పనిముట్లు తక్కువ అద్దెతో అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే...

## ఏ యంత్రాలు కావాలో రైతులదే నిర్ణయం

ఇంతకు ముందు 6,525 ఆర్బీకేల స్థాయిలో, 391 క్లస్టర్ స్థాయిలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లను రైతుల పేరుతో ప్రారంభించాం. వాటి పరిధిలో 3,800 ట్రాక్టర్లు, 391 కంబైన్డ్ హార్వెస్టర్లు, 22,580 ఇతర యంత్రాలు, వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశాం. ఇప్పుడు మరో 3,919 ఆర్.బి.కె.ల స్థాయిలో, మిగిలిన 100 క్లస్టర్ స్థాయి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు అన్నింటిలో 2,562 ట్రాక్టర్లు, 100 కంబైన్డ్ హార్వెస్టర్లు, 13,573 ఇతర యంత్రాలను అందుబాటులో ఉంచుతున్నాం. ప్రతి ఆర్.బి.కె. స్థాయిలో రూ.15 లక్షలు కేటాయించి, అక్కడ ఎటువంటి యంత్రాలు కావాలో రైతులనే నిర్ణయించుకోమని చెప్పాం. వాళ్ల నిర్ణయం ప్రకారం రూ.15 లక్షల మేరకు ఆ యంత్రసేవలన్నీ వారి అవసరాల మేరకు తీసుకొస్తున్నాం.

491 క్లస్టర్ స్థాయి సెంటర్లలో వరి బాగా పండుతున్న చోట కంబైన్డ్ హార్వెస్టర్లు తీసుకు రావాల్సిన అవసరం ఉందని గుర్తించాం. అక్కడ ఒక్కో క్లస్టర్ స్థాయిలో ఒక్కో హార్వెస్టర్‌ను రూ.25 లక్షల వ్యయంతో రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నాం. ఇందుకు రూ.1052 కోట్లు ఖర్చు పెడుతున్నాం. గ్రూపులుగా ఏర్పడిన రైతులు కేవలం 10 శాతం డబ్బులు కడితే చాలు.. 40 శాతం ప్రభుత్వమే సబ్సిడీ కింద ఇస్తుంది. మిగిలిన 50 శాతం రుణాల కింద ఆ ఆర్.బి.కె. పరిధిలో ఉన్న రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

## వై.ఎస్.ఆర్. యంత్రసేవ యాప్

ఆర్.బి.కె. స్థాయిలో ఏ రైతు అయినా ఈ యంత్రాలను అతి తక్కువ అద్దెతో వాడుకునేందుకు వై.ఎస్.ఆర్. యంత్ర సేవ యాప్‌ను అందుబాటులోకి తీసుకుని వస్తున్నాం. ఈ యాప్ సహాయంతో 15 రోజులు ముందుగానే వ్యవసాయ ఉపకరణాలను బుక్ చేసుకోవచ్చు. వీటి వల్ల మంచి జరగాలని, ప్రతి ఆర్.బి.కె. పరిధిలోని రైతులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరుతున్నాం.

ఈ ఏడాది అక్టోబర్ నెలలో 7 లక్షల మంది రైతులకు మంచి చేస్తూ.. వారికి అవసరమైన స్ప్రేయర్లు. టార్పాలిన్లు, వీడర్లు వంటి వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లను నిరుపేదలైన రైతులకు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. ఆర్.బి.కె. – వ్యవస్థను పటిష్ఠం చేస్తూ, రైతులకు ఇంకా మంచి జరగాలన్న తపనతో ముందుకు వెళ్తున్నాం.






# కిసాన్ జి.పి.టి.

## కృత్రిమ మేథస్సుతో రైతులకు దిశా నిర్దేశం

స్మార్ట్ ఫోన్... ఇది చేతిలో లేకుండా ఒక అరగంట కూడా ఉండలేము కదా...అంతగా మన జీవితంలో అది పెనవేసుకుపోయింది....మన దైనందిన వ్యవహారాల్లో సగం ఈ ఫోనే చక్క బెడుతుందనేది కాదనలేని వాస్తవం..ఇప్పుడు సాంకేతికత రోజు రోజుకు కొత్త పుంతలు తొక్కుతోంది....అందులో భాగమే...కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్)... అందులోంచి అవిర్భవించిందే.. ఛాట్ జి.పి.టి.. సంభాషణాత్మకంగా సమాధానాలు అందించడమే ఛాట్ జి.పి.టి.... ఉద్దేశం... అందులోంచే పుట్టింది కిసాన్ జి.పి.టి...ఇది వ్యవసాయం, ఇతర అనుబంధ రంగాల్లోని అధునాతన సాంకేతికతను, పంటల సాగులో మెళకువలను, చీడ పీడల నివారణకు సంభందించిన సమాచారంతో రైతులకు దిశా నిర్దేశం చేస్తూ..పంటల ఉత్పత్తిని పెంచడంలో సహాయ పడడానికి రూపొందించింది...

ఈ కిసాన్ జిపిటీ అనేది ఛాట్‌జిపిటి విస్పర్ ఆధారంగా రూపొందించిన ఎఐ–ఆధారిత చాట్‌బాట్. రైతులు ఈ ఛాట్‌బాట్‌ని ఉపయోగించి పంట నుండి అధిక దిగుబడులను పొందవచ్చు. వీరు ప్రత్యేకంగా వ్యవసాయ ఆధారిత అంశాలకు సంబంధించిన విషయాలను రైతులకు అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా నిరక్షరాస్యులైన రైతులు సైతం వాయిస్ సెర్చ్ ద్వారా అడిగితే “కిసాన్ జిపిటి”

సైతం సమాధానాన్ని చదివి వినిపిస్తుంది.

## కిసాన్ జిపిటీ అంటే ఏమిటి?

కిసాన్ (గ్రామీణ ప్రగతి తివారీ (జిపిటీ) అనేది "భారతదేశంలో వ్యవసాయ డొమైన్" కోసం ఛాట్‌జిపిటి విస్పర్ ఆధారంగా రూపొందించిన ఎఐ–ఆధారిత ఛాట్‌బాట్. ఇది పంటల సాగు, చీడపీడల నియంత్రణ, నీటిపారుదల, నేల సంరక్షణ వ్యవసాయానికి సంబంధించిన ఇతర అంశాలపై తక్షణమే పరిష్కారం అందిస్తుంది. దీనిని 2023 సంవత్సరం మార్చి 15న ప్రతీక్ దేశాయ్ అందుబాటులోకి తెచ్చారు.

## కిసాన్ జిపిటీ ఇంటర్‌ఫేస్

కిసాన్ జిపిటీ ఇంటర్‌ఫేస్ వినియోగదారులకు చాలా సులభం. ఇతర ప్రముఖ ఎఐ చాట్‌బాట్‌ల మాదిరిగా కాకుండా, వారి ప్రశ్నలను రాయడానికి ఎంపిక ఉంటుంది, కిసాన్ జిపిటీ ఇన్‌పుట్‌ల కోసం వినియోగదారుల ఫోన్ లేదా ల్యాప్‌టాప్ మైక్రోఫోన్‌లను యాక్సెస్ చేస్తుంది. ఇది పోర్చుగీస్, జపనీస్, స్పానిష్, ఇండోనేషియాతో పాటు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, బెంగాలీ, కన్నడ, మరాఠీ, గుజరాతీతో సహా 10 భారతీయ భాషలకు మద్దతు ఇస్తుంది. రైతులు వారి భాషలో, స్మార్ట్‌ఫోన్ల ద్వారా చాట్‌బాట్‌తో సంభాషించవచ్చు మరియు వారి ప్రశ్నలకు సెకన్లలో వివరణాత్మక సమాధానాలను పొందవచ్చు.

"కిసాన్ జిపిటీ అనేది రైతులకు మాత్రమే కాకుండా, వ్యవసాయంపై ఆసక్తి ఉన్న పరిశోధకులు, విద్యార్థులు, అభిరుచి గల వారి కోసం రూపొందించబడింది" అని కంపెనీ పేర్కొంది. ప్రస్తుతం ఫలితాలను ఇంకా మెరుగుపరచడానికి ప్రభుత్వం, వ్యవసాయ సంస్థలతో సమన్వయ వేదిక ఏర్పాటు చేసి, తద్వారా నూతన సమాచారాన్ని ప్రాంతాలకు అనువుగా అందిస్తే రైతులు మెరుగైన ఫలితాలు సాదించడానికి అవకాశం కల్పించవచ్చు.

**ఈ. రవి గౌడ్, యం. ఆదినారాయణ,**
**జి. ధనలక్ష్మి, కృషి విజ్ఞాన కేంద్రం,**
**యాగంటిపల్లి, నంద్యాల జిల్లా**








# రైతు సేవలో 25 సంవత్సరాలు ఒంగోలు జీవ నియంత్రణ ప్రయోగశాల



**ఆర్. కాంచన**
ఎ.డి.ఎ. ఇన్‌ఛార్జ్
జీవనియంత్రణ ప్రయోగశాల - ఒంగోలు
ఫోన్ : 6305222567

వ్యవసాయంలో చీడపీడలను అదుపు చేయడానికి రైతులు క్రమంగా రసాయనాలమీద ఎక్కువగా ఆధారపడ్డారు. విచక్షణా రహితంగా రసాయనాలను వాడడం వలన ప్రకృతి సిద్ధమైన శతృవులు (మేలు చేసే పురుగులు) నశించి, హానిచేసే పురుగులు, తెగుళ్ళు నిరోధకశక్తిని పెంచుకుంటున్నాయి. ఫలితంగా మానవాళికి, జంతుజాలానికి, పర్యావరణానికి ముప్పు ఏర్పడినది. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణలో ముఖ్య భాగమైన జీవనియంత్రణకు ప్రాధాన్యత పెరిగింది. రాష్ట్రంలో జీవనియంత్రణ ప్రయోగశాలల ఆవిర్భావం జరిగింది. ఈ ఉద్దేశ్యంతో ఒంగోలులోని జీవనియంత్రణ ప్రయోగశాల ది. 19-9-1997 ప్రారంభించబడి ఇప్పటికీ నిర్విరామంగా రైతులకు సేవలందిస్తోంది. ఈ ప్రయోగశాలలో శిలీంద్రనాశినులైన ట్రైకోడెర్మావిరిడి, సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్‌ను ఉత్పత్తి చేసి రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు.

ఆకుమచ్చ తెగులు, పొడతెగులును నియంత్రించడంలో సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ సమర్ధవంతంగా పనిచేస్తుంది.

వేరు సంబంధిత తెగుళ్ళు అయినటువంటి వేరుకుళ్ళు, దుంపకుళ్ళు, వడలు తెగుళ్ళను ట్రైకోడెర్మావిరిడి సమర్ధవంతంగా అరికడుతుంది. ఈ జీవ నియంత్రణ కల్చర్‌ను ఈ క్రిందివిధంగా ఉపయోగించాలి.

**ట్రైకోడెర్మావిరిడి :** ఒక కిలో విత్తనానికి 10 గ్రా.ల పొడిమందును కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. అదే భూమిలో వేయడానికి ఒక ఎకరానికి 4 కిలోల కల్చర్‌ను 90 కిలోల పశు వుల ఎరువు, 10 కిలోల వేపపిండి మిశ్రమంతో కలిపి భూమిలో తేమ ఉన్నప్పుడు ఆఖరి దుక్కిలో వేసుకోవాలి.

సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ : విత్తనశుద్ధికి ఒక కిలో విత్తనానికి 10 గ్రా.ల పొడిమందును కలిపి ఉపయోగించాలి. అదే భూమిలో వేయడానికి ఒక ఎకరానికి 2 కిలోల కల్చర్‌ను 90 కిలోల పశు వుల ఎరువు, 10 కిలోల వేపపిండితో కలిపిన మిశ్రమాన్ని భూమిలో తేమ ఉన్నప్పుడు ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. పిచికారి చేయడానికి ఒక కిలో కల్చర్‌ను 200 లీ.ల నీటిలో కలిపి ఉపయోగించాలి.

సూచన : ఈ రెండింటిని రసాయనిక ఎరువులు, పురుగు మందులతో కలిపి వాడరాదు. చల్లని, పొడి ప్రదేశాలలో నిల్వ ఉంచాలి.

**జీవ నియంత్రణ ప్రయోగశాల, ఒంగోలు, ప్రకాశం జిల్లా 2010 నుండి 2023 వరకు ఉత్పత్తి చేసిన వివరాలు**

| వ.సం. | సంవత్సరం | ట్రైకోడెర్మావిరిడి (Kgs.) | సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ (Kgs.) |
|---|---|---|---|
| 1. | 2010-11 | 2800 | 5050 |
| 2. | 2011-12 | 3638 | 4166 |
| 3. | 2012-13 | 4000 | 2000 |
| 4. | 2013-14 | 7012 | 1400 |
| 5. | 2014-15 | 10543 | 2060.5 |
| 6. | 2015-16 | 13880 | 1180.5 |
| 7. | 2016-17 | 19700 | 230 |
| 8. | 2017-18 | 33403 | 1857 |
| 9. | 2018-19 | 34679 | 1042 |
| 10. | 2019-20 | 32750 | 2450 |
| 11. | 2020-21 | 44441 | 8428 |
| 12. | 2021-22 | 29789 | 6800 |
| 13. | 2022-23 | 35550 | 6461 |
| | **మొత్తం** | **299840** | **45991** |

సాంకేతిక సమాచారం

# వేరుశనగ సాగు ఇలా...



వేరుశనగ పంట ఖరీఫ్‌లో మే నెల నుండి జూలై నెల ఆఖరు వరకు, రబీలో నవంబర్ 1 నుండి డిసెంబరు 15 వరకు విత్తనాలు వేసుకోవడానికి అనుకూలం.

**అనువైన రకాలు :**

**జె.యల్.-24 :** మంచి వర్షపాతం, నీటి వసతి వున్న ప్రాంతాలకు అనువైనది. గింజలు పెద్దవిగా ఉండి ఒకేసారి కాయువక్వత వుంటుంది. ఆకుమచ్చ తెగులును తట్టుకోలేదు. 47.0 శాతం నూనెను కలిగి ఉంటుంది. దిగుబడి ఖరీఫ్‌లో ఎకరాకు 600-720 కిలోలు మరియు రబీలో 1400-1520 కిలోలు.

**కదిరి-6 :** చిన్న గుత్తిరకం, స్పానిష్ బంచ్ రకం, పంటకాలం 100 రోజులు. 48.0% నూనెను కలిగి ఉంటుంది. ఖరీఫ్‌లో దిగుబడి ఎకరాకు 800-900 కిలోలు, రబీలో 1600-1700 కిలోలు.

**కదిరి-7 బోల్డు :** పెద్ద గుత్తి రకం. వర్జీనియ బంచ్ రకం ఆకుమచ్చ, తామర పురుగులను తట్టుకొంటుంది. లావు గింజ రకం. పంటకాలం ఖరీఫ్‌లో 120-125 రోజులు. రబీలో 130-135 రోజులు. 49.0 శాతం నూనెను కలిగి ఉంటుంది. ఖరీఫ్‌లో దిగుబడి ఎకరాకు 800-1200 కిలోలు, రబీలో 1800-2000 కిలోలు.

**కదిరి-8 బోల్డు :** పెద్ద గుత్తి రకం. తామర పురుగులను తట్టుకుంటుంది. లావు గింజల రకం. పంటకాలం - ఖరీఫ్‌లో 115-120 రోజులు, రబీలో 125-130 రోజులు. నూనె పరిమాణం 49.0 శాతం. దిగుబడి ఎకరాకు ఖరీఫ్‌లో 800-1000 కిలోలు, రబీలో 1800-2000 కిలోలు.

**కదిరి-9 :** చిన్న గుత్తి రకం. వర్షాభావ పరిస్థితులను, బెట్టను బాగా తట్టుకొంటుంది. ఆకుమచ్చ, వేరుకుళ్ళు తెగుళ్ళను, రసం పీల్చే పచ్చదోమ, తామర పురుగులు, నులిపురుగు, ఎర్రనల్లిని తట్టుకొంటుంది. పంటకాలం ఖరీఫ్‌లో 105-110 రోజులు, రబీలో 115-120 రోజులు. నూనె శాతం 52.0. దిగుబడి ఎకరాకు ఖరీఫ్‌లో 800-1000 కిలోలు, రబీలో 1400-1600 కిలోలు.

**కదిరి హరితాంధ్ర :** స్పానిష్ బంచ్ రకం. బెట్టను, ఆకుమచ్చ తెగులును, తామర పురుగులను తట్టుకుంటుంది. నూనె శాతం 48.0. దిగుబడి ఎకరాకు ఖరీఫ్‌లో 800-1000 కిలోలు, రబీలో 1600-2000 కిలోలు.

**నారాయణి :** చిన్న గుత్తిరకం. ఆకుమచ్చ తెగులును తట్టుకుంటుంది. రబీకి కూడ అనువైనది. గింజలు లేత ఎరుపు రంగులో ఉంటాయి. నూనె శాతం 49. దిగుబడి ఎకరాకు ఖరీఫ్‌లో 800-1000 కిలోలు, రబీలో 1400-1800 కిలోలు.

**కదిరి అనంత :** చిన్నగుత్తిరకం. స్పానిష్ బంచ్ రకం. వర్షాభావ పరిస్థితులను, ఆకుమచ్చ తెగులును, రసం పీల్చే పురుగులను తట్టుకుంటుంది. పంటకాలం : ఖరీఫ్‌లో - 105-110 రోజులు, రబీలో 110-120 రోజులు. దిగుబడి ఎకరాకు ఖరీఫ్‌లో 800-1000 కిలోలు, రబీలో 1400-1800 కిలోలు.



**కదిరి అమరావతి :** చిన్న గుత్తి రకం. వర్షాభావ పరిస్థితులని తట్టుకొంటుంది. రసం పీల్చే పురుగులుని వైరస్‌తెగుళ్ళ నుండి తట్టుకుంటుంది.

**పంటకాలం :** ఖరీఫ్‌లో – 105–110 రోజులు, రబీలో 110–120 రోజులు. దిగుబడి ఎకరాకు ఖరీఫ్‌లో 800 – 1000 కిలోలు, రబీలో 1400–1800 కిలోలు.

**కదిరి లేపాక్షి :** చిన్న గుత్తి రకం. 110–115 రోజులులో పంట కోతకి వస్తుంది. ఒక్క కాయలో రెండు గింజలును కలిగి కాయ మధ్యస్థ లావులో ఉంటుంది. ఎకరానికి ఖరీఫ్‌లో 1500–2000 కిలోలు, రబీలో 2500–3000 కిలోలు దిగుబడినిచ్చే రకం. వర్షాభావ పరిస్థితులని తట్టుకొంటుంది. రసం పీల్చే పురుగులుని మరియు వైరస్ తెగుళ్ళ నుండి తట్టుకుంటుంది. అధిక నూనె శాతం (51%) కలిగి ఉంటుంది.

**ఎరువుల యాజమాన్యం : (ఎకరాకు కిలోల్లో)**

ఆఖరు దుక్కిలో ఎకరాకు 4–5 టన్నుల సేంద్రీయ ఎరువు వేయాలి. మొత్తం భాస్వరం, పొటాష్ ఎరువులను విత్తే సమయంలోనే వేసుకోవాలి. వర్షాధారపు పంటకు ఎకరానికి 100 కిలోల సూపర్ ఫాస్ఫేటు, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మరియు 18 కిలోల యూరియాను విత్తే సమయంలోనే వేయాలి. నీటిపారుదల క్రింద రబీ పంటకు ఎకరానికి 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, మరియు 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఆఖరి దుక్కిలో వేయాలి, అలాగే 18 కిలోల యూరియాను విత్తే సమయంలో, 9 కిలోల యూరియాను 30 రోజుల తర్వాత అంటే తొలి పూత దశలో వేసుకోవాలి.

నీటి పారుదల క్రింద ఎకరానికి 200 కిలోల జిప్సంను తొలి పూత సమయంలో మొక్కల మొదళ్ళ దగ్గర చాళ్ళలో వేసి కలుపుతీసి మొక్కల మొదళ్ళకు మట్టిని ఎగదోయాలి. వర్షాభావ పరిస్థితుల్లో జిప్సంను వూడలు దిగే సమయం (విత్తిన 45 రోజులు) లో అనగా రెండవ కలుపు తీసే సమయంలోనే వేయాలి.

విత్తిన 45 రోజుల తరువాత ఎటువంటి అంతరసేద్యం చేయరాదు. నీటి పారుదల క్రింద సాగు చేసే పంటకు ఎకరానికి 4 కిలోల బోరాక్స్‌ను విత్తేటప్పుడు వేయాలి. బోరాన్ గింజల అభివృద్ధికి అవసరం. కదిరి లేపాక్షి రకమును సాగుచేసేదగ్గర ఒకటిన్నర రెట్లు ఎరువులను అధిక మోతాదులో వాడడం వలన అధిక దిగుబడి సాధించవచ్చు.

**కలుపు నివారణ, అంతర కృషి :**

కలుపు మొలకెత్తక ముందే నశింపజేయగల కలుపు నాశినులైన అలాక్లోర్ 50% ఎకరాకు ఒక లీటరు లేదా పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.3–1.6 లీ. లేదా బ్యుటాక్లోర్ 50% 1.25–1.5 లీ. చొప్పున ఏదో ఒకదానిని 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన వెంటనే గాని లేదా 2–3 రోజుల లోపల నేలపై పిచికారీ చేయాలి. విత్తిన 20, 25 రోజులప్పుడు గొర్రుతో అంతరకృషిచేసి మొక్కల మొదళ్ళకు మట్టినిఎగదోయాలి. విత్తిన 45 రోజుల లోపు ఎలాంటి కలుపు లేకుండా చూడాలి. 45 రోజుల తర్వాత ఏ విధమైన అంతరకృషి చేయరాదు. లేనిచో ఊడలు దెబ్బతిని దిగుబడి తగ్గుతుంది.

విత్తిన వెంటనే కలుపునాశినిని వాడలేకపోయినా లేదా 20 రోజులప్పుడు కలుపు తీయడానికి కూలీలు దొరకని పరిస్థితుల్లో పైరులో మొలిచిన కలుపును కలుపు నాశినులతో నిర్మూలించుకోవచ్చు. విత్తిన 20 రోజులలోపు కలుపు 2–3 ఆకుల దశలో వున్నప్పుడు ఇమాజితపైర్ 10% మందును ఎకరాకు 300 మి.లీ. లేదా క్విజలోఫాప్ ఇథైల్ 5% మందును 300 మి.లీ. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి చాళ్ళ మధ్యలో కలుపు మీద పిచికారీ చేసి కలుపును నశింపచేయవచ్చు. దీనివల్ల పైరుకు ఎటువంటి నష్టం కలగకుండా కలుపు నాశనం అవుతుంది.



డా. కె. తేజేశ్వరరావు, డా. యం. స్వాతి, డా. కె. లక్ష్మణ,
డా. పి.వి.కె. జగన్నాధరావు
ఏరువాక కేంద్రం, విజయనగరం

# వరికి ప్రత్యామ్నాయంగా ఊద

INTERNATIONAL YEAR OF MILLETS 2023



మన దేశం, చైనా దేశాలలో వరి పంటకు ప్రత్యామ్నాయంగా పండిస్తున్నారు. ఊద మిగిలిన అన్ని చిరుధాన్యాలతో పోల్చితే తక్కువ కాల పరిమితి కలిగిన పంట. ఇది సమ శీతోష్ణ మరియు ఉష్ణమండలాల్లో కూడా బతకగలదు. అదిక ఉష్ణోగ్రతలను కూడా తట్టుకోగలదు. సముద్ర మట్టం నుంచి 2700 మీటర్ల ఎత్తు వరకు కూడా పెంచుకోవచ్చు. సుమారుగా 200 - 400 మి.మీ. సంవత్సర వర్షపాతం సరిపోతుంది. ఊద పంట యొక్క విస్తీర్ణం ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర మరియు తమిళనాడు రాష్ట్రాలలో అదికం.

**రకాలు : డి.హెచ్.బి.యం 93-3 :** ఇది 90-95 రోజుల పంటకాలం, 22-24 క్వి./హె, రసాయన ఎరువులకు ఎక్కువగా స్పందిస్తుంది. **కొ2** పంటకాలం 95-100 రోజులు, దిగుబడి 21-22, క్వి/ హెక్టారుకు, ఎక్కువ పిలకలు పెడుతుంది. పంట పడిపోదు.

**వి.ఎల్.మధిర-207:** పంట కాలం 80 - 90 రోజులు. దిగుబడి 16-18క్వి/ హె. పంట పడిపోదు. గింజ రాలదు.

**వి.ఎల్.మధిర-29 :** పంటకాలం 85-90 రోజులు. దిగుబడి 25-26 క్వి. హె మధ్యస్థ కాలవ్యవధి కలిగి అధిక దిగుబడి నిస్తుంది

**వి.ఎల్.మధిర -21 :** పంటకాలం 80-90 రోజులు. దిగుబడి 25-30 క్వి. /హె.. అధిక దిగుబడి నిచ్చే మధ్యస్థ కాల వ్యవధి గల రకం

**విత్తే సమయం :** జూన్ మొదటి పక్షం నుంచి జూలై మొదటి పక్షం వరకు

**విత్తన మోతాదు :** వరుసలలో విత్తుకునే పద్ధతిలో విత్తన మోతాదు హెక్టారుకు 8-10 కిలోలు

**వెదజల్లుకునే పద్ధతిలో :** హెక్టారుకు 15 కిలోలు అవసరమవుతుంది.

**ఎరువుల యాజమాన్యం :** విత్తనాలు విత్తుకునే 2-3 వరాల ముందు 5 టన్నుల పశువుల ఎరువును వేసి కలియదున్నుకోవాలి.

**రసాయన ఎరువులు :** 20- 20 - 0 కిలోల నత్రజని, భాస్వరం, పొటాషియం/హె.

మొత్తం భాస్వరం ఎరువును, సగం నత్రజని ఎరువును ఆఖరి దుక్కిలో విత్తేటప్పుడు చేయాలి. మిగిలిన సగం నత్రజని పిలక చేసే దశలో (25 - 20 రోజుల) వేయాలి.

**జీవన ఎరువులు :** ఆగ్రోబాక్టీరియం, రేడియో బాక్టీరియం (నత్రజనిస్థి తికరిస్తుంది), ఆస్పర్ జిల్లస్ అవవోరి (భాస్వరాన్ని కరిగిస్తుంది) అను జీవన ఎరువులను విత్తనానికి 25గ్రా చొప్పున పట్టించి విత్తుకున్నట్లయితే రసాయన ఎరువుల మోతాదును తగ్గించుకోవచ్చు.

**నీటి యాజమాన్యం :** ఊద పంటకు సాధారణంగా అందించవలసిన నీటి అవసరం చాలా తక్కువగా వుంటుంది. కానీ వర్షభావ పరిస్థితులు ఎదురైనప్పుడు మొదటి తడి నాటిన

25–30 రోజులకు రెండవ తడి కంకివచ్చేదశ 45–50 రోజులకు ఇచ్చుకోవాలి.

**కలుపు యాజమాన్యం :** ఊదలో మొదటి 30–35 రోజులు కలుపు పెరగకుండా నివారించాలి దీనికొరకు అంతరకృషి లేదా 20–25 రోజులకు భూమిలో తేమ ఉండేలా చూసుకుని 2, 4 D సోడియం సాల్ట్ 1 కేజికి పిచికారీ చేసినట్లయితే వెడల్పాకు గడ్డిని నివారించుకోవచ్చు.లేకుంటే 20–25 రోజుల మధ్యలో ఒక అంతర కృషి పాటించాలి.

**పంటకోత :** పంట పండిన వెంటనే మొక్క మొదలుతో కోసుకుని వీటిని వారం పాటు బాగా ఎండిన తరువాత ట్రాక్టర్ సహాయంతో తొక్కించాలి.

**కాండపు ఈగ :** ఇది సాధారణంగా నాటినప్పటి నుంచి 6 వారాల వయస్సు వరకు సోకుతుంది. ఈ పురుగు కాండం మధ్య బాగం తిని వేయడం వలన కాండం ఎండి పోయి, దానిని లాగినప్పుడు సులువుగా బయటకు వస్తుంది. పురుగు ఆశించిన మొక్క నుంచి. కంకులు వచ్చినప్పటికి గింజలు తాలు గింజలుగా మారిపోతాయి. దీని ప్రబావం జూలై చివరిలో లేదా ఆగష్టు మొదటి వారంలో కనిపిస్తుంది.

**యాజమాన్యం :** విత్తనాలను సకాలంలో విత్తుకోవాలి సిఫార్సు చేసిన విత్తన మోతాదును 1.5 రెట్లు అధికంగా వినియోగించినట్లయితే నష్టాన్ని తగ్గించవచ్చు పురుగు ఉధృతిని గమనించుటకు ఎకరాకు 4 – 5 లింగాకర్షక బుట్టలు పెట్టాలి. క్వినాల్‌ఫాస్ మందును లీటరునీటికి 2 మిల్లీ లీటర్ చొప్పున కలిపి పిచికారి చేసుకున్నట్లయితే పురుగును నివారించవచ్చు.

**కంకి మసి తెగులు, విత్తన మసి తెగులు :** ఈ తెగులు 20 25 డిగ్రీల ఉష్ణోగ్రత మరియు గింజ తయారీ సమయంలో ఎక్కువగా కనిపిస్తుంది మసి తెగులు బుడగల వంటి వాటిని కాండంపై ఏర్పరుస్తుంది.

**యాజమాన్యం :** వ్యాధి నిరోధక శక్తి కలిగిన పి ఆర్ జె 1, వి ఎల్ మధిర 172 వంటి వాటిని వినియోగించాలి. కార్బండిజం లేదా థైరమ్ 2 గ్రాములు 1 కిలో విత్తనానికి చొప్పున కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.



## ఊదలోపోషకాలు :

**బూడిద: 6.15%, తేమ : 7.75%, శక్తి : 363.63 కిలో కేలరీలు, మాంసకృత్తులు : 10.29, కొవ్వు : 3.87%, పీచు పదార్థం : 14.07%, కాల్షియం : 2661.18 మి. గ్రా., ఇనుము : 163.50 మి. గ్రా., జింకు : 47.64 మి. గ్రా.**




డా. ఎం. త్రివేణి, డా. ఎన్. అనురాధ,
డా. షేక్ అబ్దుల్ సలాం, డా. ఎం.ఎం.వి. శ్రీనివాసరావు,
డా. ఎమ్. దివ్య, వ్యవసాయ పరిశోధన స్థానం
విజయనగరం

# ఊదలతో నోరూరించే వంటకాలు



**పొంగలి :** తయారీ విధానం: ఒక పాత్రలో ఊద బియ్యం, పెసర పప్పు కలిపి నాలుగు కప్పుల నీళ్ళలో ఒక గంట సేపు నానబెట్టాలి. నానబెట్టుకున్న ఊద బియ్యం, పెసర పప్పు కలిపి మెత్తగా ఉడికించుకోవాలి. బాణలిలో నెయ్యి వేసుకుని జీలకర్ర, మిరియాలు, అల్లం తరుగు , ఎండు మిరపకాయలు, జీడిపప్పు, కరివేపాకుతో పోపు పెట్టుకుని మెత్తగా ఉదికించుకున్న మిశ్రమానికి పోపుని కలిపి తగినంత ఉప్పు వేసుకుంటే కమ్మని ఊద పొంగలి రెడీ. సాంబార్, చట్నీ తో తింటే ఎంతో రుచికరం.

**వడలు:** తయారీ విధానం: ఊద బియ్యం, శనగ పప్పు 3 నుంచి నాలుగు గంటలపాటు నానబెట్టుకోవాలి. నానిన ఊదలు శనగ పప్పు మిశ్రమానికి ధనియాలు, అల్లం కలిపి కొంచెం బరకగా, గట్టిగా రుబ్బుకోవాలి. అలా రుబ్బుకున్న పిండికి ఉల్లి, పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు,జీలకర్ర, ఉప్పు తగినంత చేర్చి వడ పిండిలాగా కలుపుకోవాలి. మూకుడులో నూనె పోసుకుని వడలు నూనెలో దోరగా వేయించుకోవాలి. సాయంత్రం పూట తినడానికి రుచికరంగా ఉంటాయి.





**లడ్డు :** తయారీ విధానం: ఒక కళాయిలో కొంచెం నెయ్యి ఊద పిండిని బాగా వేయించుకోవాలి. వేరుశనగలు, నువ్వులు, ఎండు కొబ్బరి తురుమును వేరు వేరుగా వేయించుకోవాలి. పై మిశ్రమానికి ఊదల పిండిని, బెల్లం వేసి మళ్ళీ మిక్సీ వేసుకోవాలి. ఈ మిశ్రమంలో వేడి చేసుకున్న నెయ్యివేసి లడ్డూలా చుట్టుకోవాలి.


డా. ఎం. త్రివేణి, డా. ఎన్. అనురాధ,
డా. షేక్ అబ్దుల్ సలాం, డా. ఎం.ఎం.వి. శ్రీనివాసరావు,
డా. ఎమ్. దివ్య, వ్యవసాయ పరిశోధన స్థానం
విజయనగరం



# ఆముదం-రకాలు

మన రాష్ట్రంలో ఆముదం పంటను చిన్న, సన్నకారు రైతులు పూర్తిగా వర్షాధార పంటగా సాగు చేయటం వలన, సమయానికి వర్షాలు రాక తరచుగా బెట్ట పరిస్థితులు ఏర్పడటం, పూత, కాయ దశలలో అధిక వర్షాల వలన బూజు తెగులురావటం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ పంటను అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు జిల్లాల్లో విస్తారంగానూ, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో సాధారణంగా పండిస్తున్నప్పటికీ అన్ని జిల్లాల్లోనూ ప్రత్యేకించి రబీలో ఈ పంటను ఆరుతడి పంటగా పండించటానికి చాలా అవకాశ ముంది. అధిక దిగిబడినిచ్చి, పంటను ఆశించే చీడ పీడలను తట్టుకోగల రకాల గురించి సంక్షిప్తంగా క్రింద వివరించటం జరిగింది.

**రకాలు :**

| రకం | విడుదలైన సం॥రం | పంటకాలం (రోజుల్లో) | దిగుబడి (కి/ఎకరాకు) | గుణగణాలు |
|---|---|---|---|---|
| **సూటి రకాలు** | | | | |
| **హరిత** | 2002 | 130-150 | 5.5-6.5 | ఎండు తెగులు, నీటి ఎద్దడిని బాగా తట్టుకొంటుంది. |
| **జ్వాల** | 2007 | 90-180 | 4.0-5.0 | ఎండు తెగులును మరియు కొంత వరకు బూజు తెగులును, ఉప్పదనమును కూడా తట్టుకొంటుంది |
| **డి.సి.ఎస్ 107** | 2011 | 100-150 | 5.0-6.0 | అధిక వంద గింజల బరువు మరియు ఎండు తెగులును బాగా తట్టుకొంటుంది. |
| **ప్రగతి** | 2015 | 120-140 | 6.0-7.0 | ఎండు తెగులును తట్టుకొంటుంది, త్వరగా కోతకు వస్తుంది. |
| **సంకర రకాలు** | | | | |
| **డి.సి.హెచ్ 177** | 2000 | 90-180 | 6.0-7.5 | బెట్టను తట్టుకొంటుంది. ఎండు తెగులును బాగా తట్టుకొంటుంది |
| **డి.సి.హెచ్ 519** | 2006 | 90-180 | 6.0-7.5 | ఎండు తెగులు మరియు పచ్చ దీపపు పురుగులను తట్టుకొనగలదు. |
| **పి.సి.హెచ్111** | 2012 | 90-180 | 7.0-8.0 | ఎండు తెగులును తట్టుకొంటుంది |
| **పి.సి.హెచ్ 222** | 2012 | 90-170 | 7.0-8.0 | ఎండు తెగులును తట్టుకొంటుంది |
| **జి.సి.హెచ్ 8** | 2018 | 95-180 | 7.0-8.0 | ఎండు తెగులును,వేరుకుళ్ళునుమరియుపచ్చదోమను తట్టుకొంటుంది |
| **ఐ.సి.హెచ్ 66** | 2019 | 90-180 | 7.0-9.0 | ఎండు తెగులును మరియుబెట్టను తట్టుకొంటుంది |
| **ఐ.సి.హెచ్ 5** | 2022 | 90-180 | 7.0-9.0 | ఎండు తెగులును మరియువేరుకుళ్లను తట్టుకొంటుంది |

పై రకాలన్నీ ఖరీఫ్ మరియు రబీ కాలాలకు అనుకూలం. అయినప్పటికీ రబీకాలంలో నీటిపారుదలక్రింద సాగు చేసేటప్పుడు హైబ్రిడ్ రకాలను వేసుకొని అధిక దిగుబడి సాధించవచ్చు. హరిత, ప్రగతిరకాలను మరియు పి.సి. హెచ్111, పి.సి. హెచ్222 అను హైబ్రిడ్‌లను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం, పాలెం నుండి పొందవచ్చు. జ్వాల, డి.సి.ఎస్ 107 రకాలను మరియు డి.సి.హెచ్. 519, డి.సి.హెచ్.177, ఐ.సి. హెచ్66మరియుఐ.సి. హెచ్ 5 సంకర రకాలు అఖిల భారత నూనె గింజల పరిశోధనా సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్ నుండి పొందవచ్చు.



**డా. ఎ.వి.ఎస్. దుర్గా ప్రసాద్, డా. వై. పవన్ కుమార్ రెడ్డి, వ్యవసాయ పరిశోధనా స్థానం, రేకులకుంట, అనంతపురం**

### వరి తొలిదశలో
# కలుపు - ఎరువుల యాజమాన్యం



వరిసాగులో మేలైన కలుపు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించి అధిక నికరాదాయాన్ని పెంచుకోవచ్చు.

**కలుపు నివారణ చర్యలు :** నారుమడిలో కలుపు నివారణ కు ప్రతి 5 సెంట్లకు 75 మి.లీ. బెంథియోకార్బ్ లేదా 40 మి.లీ. ప్రిటిలాక్లోర్ 50% సేఫనర్ లేదా 50మి.లీ. బుటాక్లోర్ లేదా 5గ్రా పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 10లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. నారు ఎదిగే దశలో ఇంకా కలుపు ఉన్నట్లయితే 12-15 రోజుల లోపు సైహాలోఫాప్ బ్యూటైల్ 10% ద్రావకం 20 మి.లీ. 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**నాటిన పొలంలో :** ప్రధాన పొలంలో కలుపు నివారణకు నాట్లు వేసిన 3-4రోజులలోపు పల్చగా నీరు పెట్టి 25 కిలోల పొడి ఇసుకలో ఎకరానికి 1.25లీటర్ల బుటాక్లోర్ లేదా 500 మి.లీ. అనిలోఫాస్ లేదా 600 మి.లీ. ప్రిటిలాక్లోర్ లేదా 50 గ్రా. ఆక్సాడయార్జిల్ గుళికలు 4.0 కిలోలు చొప్పున కలిపి సమానంగా పడేవిధంగా చల్లాలి. కలుపు మందు వేసినప్పుడు పొలంలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. ఊడ్చిన 15-20 రోజులకు గడ్డి జాతి కలుపు మొక్కలు ఎక్కువ ఉన్నట్లయితే సైహాలోఫాప్‌బ్యూటైల్ 10% ద్రావకం 2.0 మి.లీ. లేదా బిసిపైరిబాక్స్ సోడియం 10% ద్రావకం.0.4 మి.లీ. ఒకలీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. వెడల్పాకు కలుపు మొక్కలు ఉన్నట్లయితే నాటిన 20-25 రోజులలోపు ఎకరానికి 400 గ్రా. 2,4 సోడియంసాల్ట్ 80% పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**వెదజల్లు పద్ధతిలో :** వెదజల్లు పద్ధతిలో కలుపు నివారణకు విత్తిన 3-5 రోజుల మధ్య ఎకరానికి ఆక్సాడయార్జిల్ 35 గ్రా. లేదా 100మి.లీ. ప్రిటిలాక్లోర్ లేక 100గ్రా. పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ మందుల్లో ఏదో ఒకటి 25 కిలోల పొడి ఇసుకతో కలిపి సమానంగా పడేలా చల్లాలి. విత్తిన 20 రోజులకు ఎకరానికి సైహాలోఫాప్‌బ్యూటైల్ 10% ద్రావకం 400 మి.లీ. లేదా బిసిపైరిబాక్స్ 10% పిచికారీ చేసుకోవాలి. వెడల్పాటి ఆకులున్న కలుపు మొక్కలున్నట్లయితే విత్తిన 20-25 రోజులలోపు ఎకరానికి 400 గ్రా. 2,4 సోడియంసాల్ట్ 80% పొడిమందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**ఎరువుల వాడకం :**

**సేంద్రీయ ఎరువులు :** సేంద్రీయ ఎరువులలో చివికిన పశువుల ఎరువు (కంపోస్ట్) మరియు పచ్చిరొట్ట ఎరువులు ముఖ్యమైనవి. పశువుల ఎరువు లేదా పచ్చిరొట్ట ఎరువులను 10 టన్నులచొప్పున వరి పైరు నాటడానికి 2,3 వారాలు ముందుగానే పొలంలోవేసి దమ్ముచేయాలి.

**జీవన ఎరువులు : అజొల్లా :** వరి నాటిన వారం రోజుల్లో ఎకరానికి సుమారు 100 కిలోల అజొల్లా వేయాలి. 2-3 వారాలకు అది పెరిగి చాపవలే అల్లుకుంటుంది. పొలంలో నీటిని తీసివేయడం వల్ల అది నేలకు అంటుకొని కుళ్లిపోతుంది. అజొల్లా స్థిరీకరించిన నత్రజని వరికి ఉపయోగపడుతుంది.

**అజోస్పైరిల్లం :** 1 నుండి 2 కిలోల కల్చరును 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరా నేలపై వెదజల్లాలి. ఇది 8-16

కిలోల నత్రజని ఒక ఎకరానికి అందిస్తుంది. అజటోబ్యాక్టర్ 1 నుండి 2 కిలోల కల్చరును 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరా నేలపై వెదజల్లాలి. ఇది 8-16 కిలోల నత్రజని ఒక ఎకరానికి అందిస్తుంది.

**ఫాస్ఫోబాక్టీరియా :** ఇది భాస్వర సంబంధిత జీవన ఎరువు. 1 నుండి 2 కిలోలకల్చరును 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరా నేలలో దుక్కిలో వేయవచ్చు. ఇది 10-12 కిలోల భాస్వరం ఎకరానికి అందిస్తుంది.

## రసాయనిక ఎరువుల వాడకం :

**నత్రజని ఎరువులు :** నత్రజని ఎరువుల వాడకంలో చాలా జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఎరువులలోని నత్రజని నాలుగు విధాలుగా నష్ట మవుతుంది. అవి 1. నీటిలో కరిగి కొట్టు కొనిపోవడం 2. ఆవిరైపోవడం 3. భూమి లోపలి పొరల్లోకి ఇంకిపోవడం 4. నత్రజని వాయు రూపంలోకి మారి వాతావరణంలోకి కలిసిపోవడం. సాధారణ నేలలలో దీర్ఘకాలిక రకాలకు హెక్టారుకు 80 కిలోలనత్రజని, మధ్య, స్వల్పకాలిక రకాలకు 120 కిలోల నత్రజని వాడవలసి ఉంటుంది. వరి పైరు నత్రజనిని అమ్మోనియా రూపంలో ఎక్కువగా తీసుకుంటుంది. కాబట్టి వరిపైరుకు వేసే నత్రజని ఎరువులలో యూరియా, అమ్మోనియం సల్ఫేట్ ముఖ్యమైనవి. వరి పైరుకు నత్రజని ముఖ్యంగా మూడుదశలలో అవసరమౌతుంది. అవి నాట్లు వేసేటప్పుడు, పిలకలు పెట్టే సమయంలో మరియు చిరుపొట్టదశలో. నత్రజనిని వేయవలసిన దానికన్నా అధికంగా వేసినప్పుడు చీడపీడలు సమస్య కూడా ఎక్కువవుతుంది.

## పిలకలుపెట్టే దశ

**భాస్వరపు ఎరువులు :** భాస్వరపు ఎరువును మొత్తం ఆఖరి దమ్ములో వేసుకోవాలి. ఆకరి దమ్ములో భాస్వరం వేయడం వలన ఎరువు వేళ్ళకు దగ్గరగా ఉండి మొక్కలు గ్రహించుటకు అనువుగా ఉంటుంది. దీనివలన వేళ్ళ పెరుగుదల బాగుండి మొక్కలు పోషక పదార్థాలను బాగా గ్రహించగలుగుతాయి. భాస్వరం వల్ల నత్రజని వినియోగ సామర్థ్యం కుడా పెరుగుతుంది. హెక్టారుకు 60 కిలోల భాస్వరం నిచ్చు ఎరువును వాడుటమంచిది.

**పొటాష్ ఎరువులు :** వరి పైరుకు హెక్టారుకు 40 కిలోల పొటాష్ నిచ్చుఎరువులను వేసుకోవాలి. దీనిని బరువు నేలల్లో ఆఖరి దుక్కిలో ఒకసారి వేసుకుంటే చాలు. అదే తేలిక నేలల్లో రెండు సమభాగాలుగా చేసి సగభాగం ఆఖరి దమ్ములో ఒకసారి మరియు మిగతా సగం చిరు పొట్ట దశలో వేసుకోవడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చు. పొటాష్ ఎరువు గింజనాణ్యతను పెంచడమే కాక పైరు చీడపీడలు, బెట్టను తట్టుకునేలా చేస్తుంది. వరిపైరుకు వేసే పొటాష్ ఎరువులలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ముఖ్యమైనది.

**ఇనుపధాతు లోపం :** లేత చిగురాకులు తెల్లగా మారి ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఇటుక రంగు మచ్చలు వచ్చి ఆకులు నిర్జీవమవుతాయి. **నవరణ:** లీటరు నీటికి 20 గ్రా. అన్నభేది మరియు 2 గ్రా. నిమ్మఉప్పు కలిపి పిచికారీ చేయాలి.

**జింకులోపం:** వరి పైరులో జింకులోపం ఎక్కువగా కనిపిస్తుంది. ఈధాతువు లోపించినప్పుడు పైనుండి మూడు లేక నాల్గవ ఆకు మధ్య ఈనె పసుపుపచ్చగా మారిపోతుంది. ముదురు ఆకు చివర తుప్పుమచ్చులు కనిపిస్తాయి. ఆకులు చిన్నవిగా ఉండి పెళుసుగా మారతాయి. దీనిని వారణకు లీటరునీటికి 2 గ్రా. జింకుసల్ఫేట్ తీవ్రతను బట్టి 5-6 రోజుల వ్యవధిలో 2 లేక 3 సార్లు పిచికారీ చేసుకున్నట్లయితే ఈ లోపాన్ని సవరించవచ్చు.

**డా. ఎం. వెంకటలక్ష్మి, డా. కె. రేవతి, సిహెచ్. కృష్ణవేణి, డా. బి. నవీన్, డా. వి. మంజువాణి, డా.యశ్వంత్ కుమార్, డా. పి. శ్రీలత, కృషివిజ్ఞానకేంద్రం, ఘంటసాల**



# ప్రత్తిలో సకాలంలో కలుపు నివారణ

సకాలంలో ఖరీఫ్ లో వర్షాలు పడటం వలన నల్ల రేగడి మరియు తేలికపాటి భూములలో కూడ వాణిజ్య పంటగా ప్రత్తిని విస్తారంగా సాగు చేస్తున్నారు. జులై, ఆగష్టు మాసాలలో తరుచుగా వచ్చే వర్షాలకు ప్రత్తి పైరుతో పాటు కలుపుమొక్కలు కూడ ఏపుగా పెరుగుతాయి. ప్రత్తి పంటలో వరుసల మధ్య దూరం ఎక్కువగా ఉండటం, భూమిలో తేమ ఎక్కువగా ఉండటం, అధికంగా మిశ్రమ ఎరువులను వాడటం వంటి కారణాల వలన కలుపు బాగా పెరిగి పోషక పదార్థాలు, తేమ, సూర్యరశ్మి మొదలగు వాటికోసం పంటతో పోటిపడి. ప్రత్తి పెరుగుదల, పూర్తిస్థాయి దిగుబడికి ప్రత్తి నాణ్యతకు అవరోధం కలిగిస్తాయి. ప్రత్తిలో కలుపు నివారణకు మొదటి 60 రోజులు కీలక సమయమని పరిశోధన ద్వారా నిరూపించబడినది.









**ప్రధాన కలుపు మొక్కలు :**

ప్రత్తి పైరులో వచ్చే కలుపు మొక్కలను 3 రకాలుగా విభజించుకోవచ్చు.

**1. గడ్డి జాతి మొక్కలు :** గరిక, చిప్పెర, దోమకాలు గడ్డి, నక్షత్ర గడ్డి, ఊద, పుల్లర గడ్డి

**2. తుంగజాతి మొక్కలు :** తుంగ, శాఖ తుంగ, భద్రమస్తు మొదలైనవి.

**3. వెడల్పాటి జాతి మొక్కలు :** నేల ఉసిరి, తుతురుబెండ, వయ్యారి భామ, ఉత్తరేణి, ఏలిక జెముడు, చెంచలాకు, అటికమామిడి మొదలగునవి.

## కలుపు మొక్కల వలన కలిగే నష్టాలు:

కొన్ని రకాల కలుపు మొక్కలైన తుత్తుర బెండ, మరియు వయ్యారిభామ వలన ప్రత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతి పెరుగుతుంది. తెగులు కారకమైన వైరస్ గడ్డి చామంతి, వయ్యరిభామ, ఉత్తరేణి వంటి కలుపు మొక్కల పుప్పొడి రేణువులలో ఉండి గాలి, తామర పురుగుల ద్వారా ప్రత్తి పంటను ఆశిస్తుంది. కావున రైతు సోదరులు ఈ క్రింది తెలిపిన సమగ్ర యజమాన్య పద్ధతులు అవలంబించినట్లయితే అధిక దిగుబడిని పొందే అవకాశం ఉంటుంది.

ప్రత్తి పంట పొలంలో సుమారుగా 180-200 ఉంటుంది. కనుక ఏ ఒక్క పద్ధతి ద్వారా పూర్తిగా కలుపు నిర్మూలన చేయడం కష్టం. కనుక భౌతిక, సేద్య, రసాయన పద్ధతులను ఉపయోగించి సమర్థవంతంగా వివిధ దశలలో కలుపు నిర్ములన చేయవచ్చు.

**1.భౌతిక పద్ధతులు :**

కూలీలతో 15-20

రోజులల వ్యవధిలో విత్తిన 20, 40, 60 రోజులలప్పుడు కలుపు తీయవలెను అయితే మారిన పరిస్థితుల వలన కూలీల రేట్లు పెరగడం, కూలీల కొరత, పనిసామర్థ్యం తగ్గడం వలన ఈ పద్ధతి రైతులకు ఎంతో భారంగా ఉంది. అంతర కృషి చేసిన తరువాత మొక్క మొక్కకు మధ్య భాగంలో కలుపు మొక్కలను ఏరివేయటానికి ఈ పద్ధతి పాటించ వచ్చు.

**2. సేద్య పద్ధతులు :** ఈ పద్ధతి ద్వారా తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో కలుపును నివారించుకోవచ్చు. ప్రత్తి విత్తిన 20, 40, 60 రోజులప్పుడు గొర్రు, గుంటకతో నిలువు, అడ్డంగా అంతర కృషి చేయవచ్చు. దీని వలన పైరుకు సూర్యరశ్మి, గాలి తగిలి పైరు ఏపుగా పెరుగుతుంది. ప్రత్తిలో తక్కువ కాల వ్యవధి గల కంది, మినుము, పెసర, సోయా చిక్కుడు, గోరు చిక్కుడు, అలసందలు. వంటి అంతర పంటలు వేయడం వలన కలుపు ఉధృతిని తగ్గించటమే కాకుండా రైతుకు అదనపు ఆదాయం చేకురుతుంది

**3. రసాయనాలతో :-** ప్రత్తి పైరులో కలుపు మందును రెండు దశలలో అంటే ప్రత్తి విత్తిన వెంటనే, మొలచిన తర్వాత వాడి కలుపును సమర్ధవంతంగా, తక్కువ ఖర్చుతో నిర్మూలించవచ్చు. అయితే కలుపు మందులు వాడేటప్పుడు సిఫార్సు చేసిన మోతాదులో, సూచించిన సమయంలోనే వాడాలి.

**i ప్రత్తి విత్తిన వెంటనే :** ఎకరాకు 1-1.3 లీ పెండి మిథాలిన్ 30% ద్రావకం లేదా 1.5-2.0 లీ,, అలాక్లోర్ 50%. లో ద్రావకం లలో ఏదో ఒక దానిని 200 లీ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**ii ప్రత్తి మొలచిన తర్వాత :** ప్రత్తి మొలచిన 20-25 రోజులప్పుడు ఖరీఫ్ లో ఎక్కువ వర్షాలు పడి గొర్రు, గుంటకలతో అంతర కృషి కుదరనప్పుడు కలుపు ఎక్కువగా పెరుగుతుంది. అలాంటి పరిస్థితులలో కేవలం గడ్డి జాతి మొక్కలు ఎక్కువగా ఉంటే ఎకరాకు 400 మి.లీ. క్విజలోఫాప్ ఇథిల్ 5% ద్రావకం 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వెడల్పాటి మొక్కలు మాత్రమే ఉన్నప్పుడు ఎకరాకు 250 మి.లీ పైరిథైయోబాక్ 10% ద్రావకం 200 లీ, నీటిలో కలిపి పిచికారీ చేయాలి

గడ్డిజాతి మొక్కలు మరియు వెడల్పాకు మొక్కలు సమంగా ఉన్నప్పుడు ఈ రెండు మందుల మిశ్రమం ఎకరాకు 400 మి.లీ క్విజలోఫాప్ ఇథైల్ + 250 మి. లి పెరిథయోబాక్ 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ మందును కలుపు 2-4 ఆకుల దశలో ఉన్నప్పుడు పిచికారీ చేస్తే ప్రత్తికి ఎటువంటి ఇబ్బంది లేకుండా కలుపును సమర్ధవంతంగా నిర్మూలించవచ్చు. అవసరం అయితే మళ్లీ 20 రోజుల వ్యవధిలో మరొకసారి పిచికారీ చేసుకోవచ్చు. క్విజలోపాప్ ఇథైల్ బదులుగా ఎకరాకు 250 మి.లీ ప్రొపాక్విజపాప్ 10%, ద్రావకమును విడిగా కాని, అవసరాన్ని బట్టి పెరిథయోబాక్‌తో కాని కలిపి వాడుకొనవచ్చు.

## సమగ్ర కలుపు యాజమాన్యం :

సమగ్ర కలుపు యాజమన్యమనగా రెండు లేదా అంతకన్నా ఎక్కువ పద్ధతులు ఉపయోగించి పైరులో వచ్చే కలుపును అదుపు చేస్తు పర్యవరణాన్ని పరిరక్షిస్తూ అధిక దిగుబడులు సాధించవచ్చు.





**డా. డి. లక్ష్మీ కళ్యాణి, డా. కె. మోహన విష్ణువర్ధన్, డా. ఎం. శివరామ కృష్ణ, డా.వై. లావణ్య, డా. కె. వెంకటరమణమ్మ, డా. కె.అరుణ్ కుమార్, డా.కె. సుదీప్తి, డా.సి. విజయ్ కుమార్ రెడ్డి, డా. కె.అమర్‌నాథ్**
**ప్రాంతీయు వ్యవసాయ పరిశోధన స్థానం. నూనెపల్లి, నంద్యాల, కర్నూలు జిల్లా**



# వాణిజ్య సరళిలో గులాబీ





గులాబీ పువ్వులకు, గులాబీ ఆయిల్ కు స్థానిక మార్కెట్ తో పాటు ప్రపంచ మార్కెట్ లో చాలా డిమాండ్ ఉంది.నేల నుండి 6 అడుగుల ఎత్తు వరకు గులాబీ మొక్కలు పెరుగుతాయి. విజయవంతమైన వాణిజ్య గులాబీ సాగు ఎక్కువగా గులాబీ పువ్వు రకాలపై అధారపడి ఉంటుంది. కానీ గ్రీన్ హౌస్ పద్ధతిలో గులాబీ సాగు చాలా ప్రసిద్ధి చెందింది మరియు మొక్కలకు సౌకర్యవంతంగా ఉంటుంది. గులాబిలో 100 కి పైగా అనేక జాతులు ఉన్నాయి. గులాబీ అన్ని కాలాలలో పూస్తుంది.

**గులాబీ రకాలు : హైబ్రీడ్ ట్రీలు :** ఇవి అత్యంత ప్రజాదరణ పొందిన గులాబీలు, పొడవైన మొన దేలిన మొగ్గలు, సొగసైన ఆకారంలో ఉన్న పువ్వులను కలిగి ఉంటాయి. సీజన్ మొత్తం పువ్వులు ఉత్పత్తి చేయబడతాయి. ఇవి 6-8 అడుగుల ఎత్తు వరకు చేరుకోగలవు. ఈ గులాబీ పువ్వుల కోసం పెంచబడతాయి. ఇవి ల్యాండ్‌స్కేప్ మొక్కలుగా ఆకర్షణీయంగా ఉండవు.

**ఫ్లోరి బుండాలు :** ఈ గులాబీలు ప్రకాశవంతమైన రంగులలో బాగా వికసిస్తాయి. సాధారణంగా హైబ్రిడ్ ట్రీల కంటే పొట్టిగా మరియు ఎక్కువ పొద కలిగి వుంటాయి. పువ్వులు చిన్నవిగా వుంటాయి మరియు క్లస్టర్లుగా ఉంటాయి. అయితే పెద్ద పరిమాణంలో ఉత్పత్తి చేయబడతాయి. ఇవి అరుదుగా సువాసన కలిగి ఉంటాయి. కానీ ల్యాండ్‌స్కేప్ కి పొదలుగా చాలా మంచిది.

**గ్లాడియేటర్ :** ఈ రకం గులాబీలలో ఒక్క పువ్వు అరచేతి పరిమాణంలో వుంటుంది, 3-4 రోజుల వరకు విచ్చుకుని ఉంటుంది. ఇవి మరింత పెద్దగా శీతల ప్రాంతాల్లో విచ్చుకుంటాయి.

**రాంబ్లర్స్ :**ఈ గులాబీ వసంతకాలం చివరిలో లేదా వేసవి ప్రారంభంలో ఒకసారి మాత్రమే వికసిస్తుంది. ఈ రకం గులాబీ అనేక చిన్న గులాబీల సమూహాలను కలిగి ఉంటుంది. రాంబుర్లు చాలా హార్ట్ మరియు వేగంగా పెరుగుతాయి. ఒక సీజన్ లో 20 అడుగుల వరకు కూడా పెరగవచ్చు.

**డబుల్ డిలైట్ కలర్ రోజ్ :** రెండు రంగుల కలయికతో డబుల్ డిలైట్ కలర్ రోజ్ ఎంతో కనువిందుగా ఉంటుంది. డిజైన్లు చేసినట్లు మరియు ముక్కలు అతికించినట్లు అబ్బుర పరుస్తాయి. ఇవి సుగంధ పరిమళాలను వెదజల్లుతాయి.

**యూరోపియన్ రోజెస్ :** ఇవి సంవత్సరానికి ఒక ఫ్లష్ బ్లూమ్ ను కలిగి వుంటాయి. వీటి రంగులు ప్రధానంగా తెలుపు, ఎరుపు మరియు ఊదా రంగులు. ఇవి చాలా సువాసన కలిగి వుంటాయి. ఇవి వేడి ప్రాంతాలలో బాగా పెరగకపోవచ్చు.యూరోపియన్ గులాబీలలో గల్లికాస్, డామాస్క్, తల్బాలు, సెంటిఫోలియాస్, నాచు గులాబీలు వున్నాయి.

**ఆల్బా రోజెస్ :** ఈ రకం గులాబీ 8 అడుగుల వరకు పెరిగి మృదువైన కాండంతో పొడవైన పొదలను ఏర్పరుస్తుంది. ఇవి బాగా వికసించక పోయినా, చాలా ఆకర్షణీయమైన మొక్కలు.

**కాకినాడ గులాబీ :** దేశవాళీ గులాబీ, అని కాకినాడ గులాబీ అని పిలుస్తారు. పెద్ద ఎత్తున పువ్వులు సాగు చేసే గులాబీలు ఇవి. ఎక్కువగా అలంకరణకు, దండలు కట్టడానికి, తైలాలకి, సౌందర్య క్రిములకు ఈ పూలనే వాడతారు.

**చైనా రోజెస్ :** చైనా గులాబీ పువ్వులు ఎరుపు రంగు ఆకులతో మనోహరమైన పువ్వులను కలిగి వుంటాయి. సీజన్ అంతటా అవి తిరిగి వికసిస్తాయి.

**అనుకూలమైన వాతావరణం :** వివిధ వాతావరణ పరిస్థితుల్లో గులాబీలను విజయవంతంగా పెంచవచ్చు. ప్రకాశవంతమైన ఎండ రోజు, చల్లని రాత్రులు, ఒక మాదిరి తేమ మరియు బలమైన గాలులు లేని ప్రాంతాల్లో నాణ్యమైన పువ్వులు వికసిస్తాయి. సాధారణంగా పగటి ఉష్ణోగ్రత 15-16 డిగ్రీ సెంటి గ్రేడ్ వరకు. 60-40 శాతం



తేమ కలిగిన ప్రాంతాలు నాణ్యమైన పూల ఉత్పత్తికి అనుకూలంగా ఉంటాయి.

**ఎరువులు :** గులాబీ మొక్కకి నైట్రోజన్, ఫాస్ఫరస్ మరియు పొటాషియం వంటి ఎరువుల అవసరం ఉంటుంది. పువ్వుల నాణ్యతను పెంచడానికి అధిక నైట్రోజన్ మోతాదుల మరింత ప్రభావవంతంగా పనిచేస్తుంది. వేరు పెరుగుదలను ప్రోత్సహించడానికి, పుష్పించే ఉత్తేజానికి ఫాస్ఫరస్ ముఖ్యం. పుష్ప కాండం గట్టిదనం, పువ్వు మెరుగైన నాణ్యత మరియు వ్యాధులకు నిరోధకత పెరగడానికి పొటాషియం బాధ్యత వహిస్తుంది. నేలని సిద్ధం చేస్తున్నప్పుడు ఎక్కువగా సేంద్రియ పదార్థాన్ని ఉపయోగించండి.

**పించింగ్ :** గులాబి మొక్క ఎదుగుతున్న కాడలో కొంత భాగాని తొలగించడాన్ని పించింగ్ అని అంటారు. గులాబి సాగులో ఇది ఒక ముఖ్యమైన చర్య. ప్రతీసారి ఎరువులు వేసిన తరువాత, పంటకొరకు మరియు నిర్దిష్ట సమయంలో పుష్పించడం సర్దుబాటు చేయడం కొరకు పించింగ్ చేయబడుతుంది. ఇలా చేయడం వల్ల మొక్క ఎత్తు తగ్గుతుంది. పువ్వుల దిగుబడి మరియు నాణ్యతను ప్రభావితం చేసే గులాబి సాగులో ప్రూనింగ్ అనేది అత్యంత ముఖ్యమైన కార్య కలాపాల్లో ఒకటి. గులాబీ మొక్కల్లో ఒకటి, రెండు పువ్వులు రెక్కలు పూసినట్లుగా అవ్వగానే వాటిని మొక్క నుంచి వేరు చేయాల్సి ఉంటుంది, తర్వాత వెంటనే వాటిని నీళ్ళు నింపిన కంటెయినర్‌లో ఉంచి కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టాలి. ఈ ప్రూనింగ్ అనేది గులాబి పండించే ప్రాంతం వాతావరణ పరిస్థితులపై ఆధారపడి వుంటుంది.

సాధారణంగా హైబ్రిడ్ టీ మరియు ఫ్లోరి బుండ్ల గులాబీలు కత్తిరించిన తరువాత పుష్పించడానికి 45 నుండి 50 రోజులు పడుతుంది. అక్టోబర్ 15 నుండి నవంబర్ 15 వరకు ప్రూనింగ్ చేయ్యాలని సిఫార్సు చేయబడింది. శీతాకాలం చాలా చల్లగా ఉన్న కొండ ప్రాంతాల్లో, ఫిబ్రవరి చివరి వారంలో మార్చి 15 వరకు కత్తిరించే ఆపరేషన్ జరుగుతుంది.

**అంతర కృషి :** మల్చింగ్ కలుపును తగ్గిస్తుంది, నీటి ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహిస్తుంది. మొక్క ఆకులు, వరి గడ్డి మొదలైన వివిధ పదార్థాలను మల్చింగ్ కోసం ఉపయోగించవచ్చు.

**తెగుళ్ళు : 1. రెడ్ స్పైడర్ మైట్ :** ఇవి మొదట ఆకుల దిగువ ఉపరితలంపై కనిపిస్తాయి. తరువాత ఆకు, కాండం,కొంతకాలం తరువాత మొత్తం మొక్కను వ్యాపిస్తాయి. ఒమైట్ ను (ప్రోపర్ గెయిట్) పిచికారీ చేయడం ద్వారా వీటిని నియంత్రించవచ్చు

**2 గొంగళిపురుగు :** ఈ గొంగళి పురుగులు, ఎక్కువగా గులాబీ మొగ్గలు, లేత ఆకులను ఆశిస్తాయి. ప్రారంభ దశల్లో ఇవి ఆకులను తింటాయి. గుడ్లను మొగ్గలపై పెడతాయి, గొంగళిపురుగు లార్వా మొగ్గలను తిని, పూర్తిగా దెబ్బతిస్తాయి. నువాన్ ను పిచికారీ చేయడం ద్వారా గొంగళిపురుగులను నియంత్రించవచ్చు.

**3. థ్రిప్స్ :** థిప్స్ అత్యంత తీవ్రమైన చీడ. థ్రిప్స్ వేడి పరిస్థితులను ఇష్టపడుతుంది. ఈ చిన్న కీటకం మొక్క ఆకులు, లేత కాండం పువ్వుల నుంచి రసాన్ని పీల్చుకుంటుంది. థిప్స్‌ను నియంత్రించడానికి 0.05 నుండి 0.1 మిల్లీలీటర్ల డైమిథోయేట్ మోనోక్రోటోఫోన్ ను లీటర్ నీటికి కలిపి దీనిని నియంత్రించ వచ్చు.

**కోత కోయడం :** పువ్వులు బిగుతైన మొగ్గ దశలో ఉన్నప్పుడు మరియు రేకులు విప్పడం ప్రారంభించినప్పుడు కోతకు వస్తుంది. దీనిని ఉదయం లేదా సాయంత్రం కోయాలి. కోత తరువాత పువ్వులను పరిశుభ్రమైన నీటిలో ముంచాలి

**నిల్వ :** కత్తిరించిన పువ్వులను నిల్వ చేయడానికి, వాటిని 2-4 డిగ్రీ సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద మంచి నాణ్యమైన నీటిలోఉంచాలి. గులాబీ పువ్వుల దిగుబడి ప్రధానంగా వాతావరణం, క్షేత్ర నిర్వహణ, నీటి పారుదల, మరియు ఎరువులపై ఆధారప ఉంటుంది. ఒక వేళ సరైన భూమి, మంచి వ్యవసాయ నిర్వహణ ఉన్నట్లయితే, అప్పుడు ఒక హెక్టారుకు సంవత్సరానికి 10 లక్షల పువ్వులు పొందవచ్చు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో, గులాబీ పువ్వులు చాలా డిమాండ్ ఉంది. కాబట్టి గులాబీ పువ్వుల సాగు నుండి మంచి రాబడిని పొందవచ్చు.

**డా. యం. ఆదినారాయణ, కృషి విజ్ఞాన కేంద్రం,**
**బనగానపల్లె, కర్నూలు**

# ప్రత్యామ్నాయ పంటగా ఉలవ

మన రాష్ట్రంలో కేవలం మంచులో పండించే పంట ఖరీఫ్ లో మొదటి పంట అనంతరం, వర్షాధారంగా లేదా ఏ పంటలు వేయడానికి అనువుగా లేనప్పుడు ప్రత్యామ్నాయ పంటగా 'ఉలవ'ను సాగు చేయవచ్చు.

**విత్తే సమయం:** సెప్టెంబర్ అక్టోబర్

**నేలలు :** చల్క, ఎర్ర, నల్ల రేగడి నేలలు అనుకూలం, మురుగు నీరు నిలువ ఉండే నేలలు పనికి రావు.

**రకాలు : 1. పి.డి.యం1 :** పంట కాలం 105 రోజులు. ఎకరానికి 6-6.5 క్వి. దిగుబడి వస్తుంది. గింజలు బూడిద తెలుపు రంగులో ఉంటాయి. **2. వి.జడ్.యం.1:** పంట కాలం 90-95 రోజులు ఎకరానికి 6-6.5 క్వి. దిగుబడి, గింజలు నలుపు రంగులో ఉంటాయి. **3. పి. హెచ్ జి 62 :** పంటకాలం 85 రోజులు. ఎకరానికి 6-6.5 క్వి దిగుబడి, గింజలు నలుపు రంగులో ఉంచాయి. **4. పి హెచ్ జి 9.** పంట కాలం 90-100 రోజులు. ఎకరానికి 6క్వి. దిగుబడి, గింజలు బూడిద రంగులో ఉంటాయి. పల్లాకు తెగులును తట్టుకొంటుంది.

**5. క్రీడ్ -1-18 ఆర్ :** పంట కాలం 85-90 రోజులు. దిగుబడి ఎకరానికి 5-6 క్వి, గింజలు గోధుమ రంగులో .పల్లాకు తెగులు మరియు బూడిద తెగులును తట్టుకొంటుంది.

**6. క్రీడ హర్ష :** పంట కాలం 85-95 రోజులు, ఎకరానికి 6-7.5 క్వింటాళ్ళ దిగుబడి. గింజలు గోధుమ రంగులో ఉంటాయి, బూడిద తెగులు ఆంత్రాక్నోస్‌ను తట్టుకొంటుంది. **7. క్రీడ వర్ధన్ :** పంట కాలం 85-90 రోజులు. ఎకరానికి 6 - 7.5 క్వింటాళ్ళ దిగుబడి గింజలు నలుపు రంగులోన ఉంటాయి.

**విత్తన శుద్ధి :** కిలో విత్తనానికి 1 గ్రా కార్బండిజమ్ మందు కలిపి విత్తనశుద్ధి చేయాలి.

**నేల తయారి :** ఖరీస్ లో మొదటి పంట కోసిన తరువాత తగినంత తేమ చూసుకొని, భూమిని నాగలితో ఒకసారి, గొర్రుతో రెండు సార్లు మెత్తగా దున్ని నేలను తయారు చేసుకోవాలి.

**విత్తనం, విత్తే దూరం :** గొర్రుతో వరుసలో విత్తే పద్ధతిలో ఎకరాకు 8-10 కిలోలు, వెదజల్లే పద్ధతిలో 11-15 కిలోల విత్తనం సరిపోతుంది. వరుసల మధ్య 30 సెం.మీ. మొక్కల మధ్య 10 సెం.మీ దూరం పాటించాలి. ఎరువులు ఎకరాకు 4 కిలోల నత్రజని, 10కిలోల భాస్వరం, 8కిలోల పొటాష్ నిచ్చే ఎరువులను ఆఖరి దుక్కులో విత్తేముందు వేసుకోవాలి.

**అంతరకృషి :** విత్తిన 25-30 రోజుల మధ్య నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు, గొర్రు వేసి కలుపు నివారణ చేసుకోవాలి.

**సస్యరక్షణ :** కాయ తొలుచు పురుగు, పూత, పిందె ఏర్పడే సమయంలో పంటకు నష్టం కలుగజేస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి క్లోరోపైరిఫాస్ 2 మి.లీ లీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

**బూడిద తెగులు :** వాతావరణంలో అధిక తేమ ఉండి, రాత్రి, పగటి ఉష్ణోగ్రతలలో ఎక్కువ వ్యత్యాసం ఉన్నప్పుడు ఈ తెగులు ఆశిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి 1గ్రా కార్బండిజమ్ చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. తెగులు ఉధృతంగా ఉన్న ఎడల 15 రోజుల వ్యవధిలో రెండోసారి కూడా పిచికారీ చేసుకోవాలి. నీటివనరులు లేని ప్రాంతాల్లో ఖరీఫ్ అనంతరం భూమిని ఖాళీగా వదలకుండా నీటి ఎద్దడిని తట్టుకొని కేవలం మంచు ఆధారంగా పెరిగే ఉలవ పంట సాగు రైతులకు ఎంతో లాభదాయకం.

**డా. యు. త్రివేణి, డా.ఎన్. అనురాధ,**
**డా. టి.ఎస్.ఎన్.కె. పాత్రో, డా. వై. సంధ్యా రాణి**
**వ్యవసాయ పరిశోధనా స్థానం, విజయగగరం.**



# చిత్రమాలిక





**యంత్రాల దన్ను :** గుంటూరులో జరిగిన యంత్రసేవా మేళాను జండా ఊపి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి. నెల్లూరు జిల్లాలో రైతు గ్రూపునకు ట్రాక్టరు అందజేస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



**సాంకేతిక సహకారం :** గన్నవరం సమీకృత సమాచార కేంద్రంలో రైతుల కాల్స్ ఆసక్తిగా పరిశీలిస్తున్న ఇథోపియా బృందం



**పెట్టుబడి రాయితీ విడుదల :** నెల్లూరు జిల్లాలో చెక్కు విడుదల చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి




**ఎగుమతులకు ప్రోత్సాహం :** రాష్ట్రం నుంచి వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి చేసేందుకు కార్యాచరణపై ప్రసంగిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి




**జాతీయ పురస్కారం :** సూక్ష్మ సేద్యం చక్కగా అమలుచేస్తున్నందుకు కడప జిల్లా, పులివెందుల మండలం, ఇ-కొత్తపల్లి పంచాయతీ తరపున జాతీయ పురస్కారం న్యూఢిల్లీలో అందుకొంటున్న సర్పంచి, అధికారులు



# అన్ని కాలాలకు అనుకూలం టమాట

రాష్ట్రంలో అత్యధికంగా సాగు చేసే కూరగాయలలో టమాట ఒకటి. సంవత్సరం పొడవునా అన్ని ఋతువుల్లోనూ సాగు చేయవచ్చు. అధిక దిగుబడికి శీతాకాలం అనుకూలం. అధిక ఉష్ణోగ్రత, ఎక్కువ వర్షపాతానికి తట్టుకోలేదు.

**రకాలు-అనుకూలత : వర్షాధార పంటకు :** ఖరీఫ్ లో ముందుగా వేసుకోవడానికి అర్క మేఘాలి (పంట కాలం 130 రోజులు, దిగుబడి ఎకరాకు 7-8 టన్నులు), పూసాఎర్లీడ్వార్ఫ్ (పంట కాలం 120-130 రోజులు, దిగుబడి ఎకరాకు 12 టన్నులు), అలాగే ఖరీఫ్ లో ఆలస్యంగా వేసుకోడానికి పూసారూబీ, అర్క వికాస్ రకాలు అనుకూలం.

**శీతాకాలానికి :** పూసారూబీ(పంట కాలం 130-135 రోజులు, దిగుబడి ఎకరాకు 12 టన్నులు), పూసాఎర్లీడ్వార్ఫ్, అర్క వికాస్ (పంట కాలం 105-110 రోజులు, దిగుబడి ఎకరాకు 14.5-16 టన్నులు), అర్కా సౌరభ్ (పంట కాలం 105-110 రోజులు, దిగుబడి ఎకరాకు 14 టన్నులు), అర్క సామ్రాట్, అర్క రక్షక్.

**ప్రాసెసింగ్‌కి అనుకూలమైన రకాలు:** అర్క రక్షక్, అర్క రోషిణి, అర్క రేష్మి, అభినవ్

**విత్తన మోతాదు :** ఎకరాకు సూటి రకాలకు 200 గ్రా. సంకర జాతి రకాలకు 60-80 గ్రా. విత్తనం కావాలి. విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రా. థైరామ్ తో లేదా 3 గ్రా. మెటలాక్సిల్ తో, 2 గంటల తర్వాత 4 గ్రా. ట్రైకోడెర్మా కల్చర్ తోను విత్తనశుద్ధి చేయాలి.

**నారుపోయుట :** ఎకరం పొలంలో నాటడానికి 4 X 1 చ.మీ. విస్తీర్ణం గల, 6” ఎత్తైన 8 నుండి 10 నారుమళ్ళు తయారుచేయాలి. నారుకుళ్ళు తెగులు సోకకుండా ముందు జాగ్రత్తగా లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా 0.5% బోర్డో మిశ్రమంతో నారుమళ్ళను శుద్ధి చేయాలి. (100 లీ. మందు ద్రావణం 40 చ.మీ. నారుమడికి) విత్తే ముందు విత్తనాలను 600 సెల్సియస్ వేడి నీటిలో 5-10 ని. ల సేపు ఉంచి తీయాలి. నారుమడిలో 10 సెం.మీ. ఎడంతో వరుసల్లో 1-1.5 సెం.మీ. లోతులో విత్తనాలను పలుచగా విత్తుకోవాలి. విత్తిన వెంటనే రోజ్ క్యాన్ తో నీటిని చల్లి వరిగడ్డితో నారుమళ్ళను కప్పాలి. విత్తనాలు మొలకెత్తిన వెంటనే (7-10 రోజులకు) మల్చింగ్ గా వేసిన వరిగడ్డి లేదా పాలిథిన్ షీట్ తీసివేయాలి. 2-3 వారాల వయసులో నారుకుళ్ళు తెగులు రాకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ (2.5 గ్రా./లీ) పిచికారీ చేయాలి. 3 వారాల వయస్సు గల నారుమడికి రసం పీల్చే పురుగుల నుండి రక్షణకు ఫిప్రోనిల్ ను లీ.నీటికి 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. నారుమడిని పీకడానికి 2-3 రోజులకు

ముందుగా లీటరు నీటికి 0.4 మి.లీ. ఇమిడాక్లోరోప్రిడ్ 1 గ్రా. కార్బండిజమ్ ను కలిపి నారుమడి పై పిచికారీ చేయాలి. నారుమడిలో మొక్కల ధృడపడడానికి గింజ విత్తిన 21-25 రోజుల మధ్య రోజు విడిచి రోజు నీరు కట్టాలి. 21-25 రోజుల వయసు ఉండి3-4 ఆకులు గల మొక్కల్ని నాటుకోవాలి. సాధ్యమైనంత వరకు 30 రోజులు మించిన ముదురునారును నాటరాదు.

**నాటటం:** వర్షాకాలంలో 60x45 సెం.మీ. శీతాకాలంలో 60X60 సెం.మీ. వేసవిలో 45x30 సెం.మీ. దూరంలో నాటుకోవాలి.

**ఎరువులు:** చివరి దుక్కిలో ఎకరాకు 6-8 టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. నాటేటప్పుడు ఎకరాకు 24 కిలోల భాస్వరం (150 కిలోల సూపర్ ఫాస్ఫేట్) మరియు 24 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులను (40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) వేయాలి. 48-60 కిలోల నత్రజనినీ 3 సమపాళ్ళుగా చేసి, నాటిన 30,45,60వ రోజున పైపాటుగా వేసి బోదెలు ఎగదోయాలి. నాటే ముందు ఎకరాకు 8-12 కిలోల చొప్పున బోరాక్స్ వేసినట్లయితే పండ్లు పగలకుండా ఉంటాయి. ఎకరాకు 10 కిలోల చొప్పున జింకు సల్ఫేట్ చేసినట్లయితే జింకు లోపం రాకుండా ఉంటుంది. పూత దశలో ఎకరాకు 400 మి.గ్రా. 2,4 డి మందును 200 లీటర్ల నీటికి కలిపి లేదా 1 మి.లీ. ప్లానోఫిక్స్ 4.0 లీ./ నీటిలో కలిపి పిచికారీ చేస్తే పూత, పిందె నిలిచి మంచి దిగుబడి వస్తుంది.

**కలుపు నివారణ, అంతరకృషి:** కలుపు నివారణకు ఎకరాకు మెట్రిబుజిన్ అనే మందును 300 గ్రా. మోతాదులో నాటిన 15 రోజులకు 200 లీటర్ల నీటిలో కలిపి వరుసల మధ్య పిచికారీ చేయాలి. నాటిన 30, 35 రోజులప్పుడు గొర్రు లేదా గుంటకతో అంతరకృషి చేయాలి.

**ఊతం ఇవ్వడం:** పొడవుగా పెరిగే హైబ్రిడ్ మొక్కలకు మరియు మామూలు రకాలకు కూడా కర్రలను పాతి ఊతం ఇవ్వాలి. ఊతమివ్వడం వలన మంచి పరిమాణం గల కాయలు ఏర్పడతాయి. అంతేకాక కాయలు నేలకు తగిలి చెడిపోకుండా కాపాడవచ్చు.



## సమగ్ర సస్యరక్షణ

కిలో విత్తనానికి ముందుగా 3 గ్రా. థైరం ఆ తర్వాత 8 గ్రా.ల ట్రైకోడెర్మా కల్చర్ తో విత్తనశుద్ధి చేయాలి. వేసవిలో దుక్కులు లోతుగా దున్నడం వల్ల నేలలో వున్న నిద్రావస్థ దశలోని పురుగులు నివారించబడతాయి. పొలం చుట్టూ జొన్న లేదా సజ్జ పంటను అడ్డుపంటగా వేయడం వల్ల రసం పీల్చుపురుగుల ఉధృతి తగ్గి టమాటాలో ఆకు ఎందుతెగులు/వైరస్ తెగులు కొంత వరకు తగ్గుతుంది. పొలంలో అక్కడక్కడ వేసిన ఆముదం మొక్కలపై ఉన్న గ్రుడ్ల సముదాయాలను, అప్పుడే పొదగబడిన పిల్ల పురుగులను ఏరి నాశనం చేయాలి. పొలంలో అక్కడక్కడ ఎకరాకు 4 చొప్పున పసుపు రంగు పూసిన రేకులకు ఆముదం/ గ్రీజ్ పూసి పెట్టాలి. తెల్లదోమలు వీటికి ఆకర్షింపబడి అతుక్కుంటాయి. ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు పెట్టి శనగపచ్చపురుగు మరియు రబ్బరు పురుగుల ఉనికిని గమనించాలి. ఎరపంటగా బంతి మొక్కలను 1:16 నిష్పత్తిలో (ఒక బంతి వరుసకు 16 టమాట వరుసలు చొప్పున) వేసుకోవాలి. 45 రోజుల బంతి నారును 25 రోజుల టమాట నారును దీనికోసం నాటుకోవాలి.

పొలంలో ఎకరానికి 20 చొప్పున పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి. మొక్క పెరుగుదల దశలో నాటిన 30 రోజుల నుండి పూత వరకు 5 శాతం వేప గింజల కషాయాన్ని 15 రోజుల తేడాతో పిచికారీ చేయాలి. బాక్టీరియాఎండుతెగులు ఉన్న చోట్ల ఎకరాకు 6 కిలోల చొప్పున బ్లీచింగ్ పొడిని నాటడానికి మందు భూమిలో కలిసేలా వేయాలి. బాక్టీరియా తెగులు నివారణకు నాటే ముందు నారును 100 పి.పి.యమ్.(100 మి.గ్రా. లీటరు నీటికి) స్ట్రెప్టోసైక్లిన్ ద్రావణంలో ముంచి నాటాలి. రసం పీల్చే పురుగుల నివారణకు ఫిప్రోనిల్ ను లీటరు నీటికి 2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ ను లీటరు నీటికి 0.4 మి.లీ. చొప్పుని పిచికారీ చేయాలి.

**డా. టి. క్రాంతికుమార్, డా. పి. లలితకామేశ్వరి,**
**కె. వీరాంజనేయులు, డా. యస్. ఆదర్శ,**
**డా. యన్. చిరంజీవి డా. ఆర్. ప్రవీణ్ బాబు**
**కృషి విజ్ఞాన కేంద్రం, పందిరిమామిడి**





# అన్ని నేలలకు అనువైన బెండ

మన రాష్ట్రంలో బెండ పంట ప్రధానంగా వర్షాకాలం మరియు వేసవి కాలంలో పండించడానికి అనుకూలమైనది. బెండ సాగుకు సారవంతమైన నీరు ఇంకే తేలికపాటి నేలలు, మురుగు నీరు పోయే సౌకర్యం గల నల్లరేగడి నేలలు అత్యంత అనుకూలం ఇసుక నేలల్లో సరైన పోషక యాజమాన్యం పాటించి బెండ సాగు చేయవచ్చు. ప్రధానంగా వర్షాకాలపు పంటకు జూన్ నుండి జులై వరకు వేసవి పంటను జనవరి రెండవ వారం నుండి ఫిబ్రవరి చివరి వరకు విత్తుకోవచ్చు.

**రకాలు : అర్క అనామిక, అర్క అభయ**

ఐ. ఐ. హెచ్. ఆర్. బెంగళూరు వారు విడుదల చేసిన అర్క నిఖిత హైబ్రీడ్ రకం నాటిన 43 రోజులకు మొదటి కోత ఇస్తుంది మరియు దాని పంట కాలం125- 130 రోజులు. వర్షా కాలంలో నేలను 4-5 సార్లు బాగా దున్ని, 60 సెం.మీ ఎడంతో బోదెలు చేసుకొని 30 సెం.మీ దూరంలో విత్తుకోవాలి. వేసవి కాలంలో అయితే 45 సెం.మీ. ఎడంతో బోదెలు చేసుకొని 15-20 సెం,, దూరం ఉండేటట్లు విత్తుకోవాలి. విత్తిన వెంటనే నీరు పెట్టి తర్వాత 4-5 రోజులకు రెండవ తడి ఇవ్వాలి, పాదుకు ఒక మొక్క ఉంచి మిగిలినవి తీసివేయాలి.

**విత్తన శుద్ధి :** కిలో విత్తనానికి 5 గ్రా ఇమిడాక్లోప్రిడ్ తో శుద్ధి చేసుకోవాలి, తర్వాత 4 గ్రా ట్రైకోడెర్మా విరిడి తో కలిపి విత్తన శుద్ధి చేయలి.

**పోషక యాజ మాన్యం :** చివరి దుక్కిలో ఎకరాకు 6-8 టన్నుల పశువుల ఎరువును వేసి బాగా కలియ దున్నాలి. 24 కిల భాస్వరం మరియు పొటాష్ నిచ్చే ఎరువులని ఆఖరి దుక్కిలో వేయాలి. 48 కిలోల నత్రజని ఎరువును 3 సమ భాగాలుగా చేసి ఒక వంతు ఆఖరి దుక్కిలో, మిగిలిన 2/3వ వంతును 2 భాగాలుగా విత్తిన 30 మరియు 45 వ రోజున వేయాలి. సంకర జాతి రకాలకు మోతాదు సుమారు 50 శాతం పెంచి వేయాలి.

**కలుపు యాజ మాన్యం :** పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.2 లీ చొప్పున విత్తిన 24-48 గంటల లోపు తగినంత తేమ ఉండునట్లు చూసుకుని వేసుకోవాలి, విత్తిన 25, 30 రోజులప్పుడు గొర్రు లేక గంటకతో అంతరకృషి చేయాలి .. వర్షాకాలంలో మట్టిని ఎగదోసి బోదెలు సరిచేయాలి. పంట పూత దశలో లీటర్ నీటికి 10 గ్రా యూరియా కలిపి పిచికారీ చేయాలి వేసవి పంటకు ప్రతి 4-5 రోజులకొకసారి నీరు పెట్టాలి. దాదాపు అన్ని రకాలు 45-50 రోజులకు మొదటి కోతకు వస్తాయి. తప్పనిసరిగా ప్రతి 2-3 రోజులకొకసారి కోత కోయాలి. వర్షాకాలపు పంటకు 3-4 టన్నులు, వేసవి పంటకు సాధారణంగా 2-2.5 టన్నుల దిగుబడి ఎకరాకు వస్తుంది.

**బెండలో సమగ్ర సస్యరక్షణ :** కిలో విత్తనానికి 5గ్రా. చొప్పున ఇమిడాక్లోప్రిడ్ ముందును వాడి విత్తనశుద్ధి చేయాలి. ఒక ఎకరాకు 100 కిలోల చొప్పున వేప పిండిని దుక్కిలో వేయాలి. కాయ తొలుచు పురుగుల ఉనికిని గమనించేందుకు లింగాకర్షక బుట్టలను ఎకరానికి నాలుగు చొప్పున అమర్చు

కోవాలి. ఎకరానికి నాలుగు చొప్పున పసుపు రంగు పూసిన రేకులకు ఆముదం /గ్రీస్ పూసి, పెట్టి తెల్ల దోమలను ఆకర్షింప జేయాలి. ఎకరాకు 20,000 చొప్పున ట్రైకోగ్రామా బదనికలు పూతదశలో వారానికి ఒకసారి చొప్పున నాలుగు సార్లు విడుదల చేయాలి. విడుదల సమయంలో పురుగు మందులు వాడరాదు. HNPV, SNPV లను ఎకరాకు 250 లార్వాలకు సమానమైన ద్రావణం పిచికారీ చేయాలి. రసం పీల్చే పురుగుల నివారణకు ఫాసలోన్, ఫిప్రొనిల్, డైమిథియేట్ మందుల్లో ఏదైనా ఒక మందును లీటరు నీటికి 2. మి. లీల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. తెల్ల దోమ నివారణకు 1.5 గ్రా. ఎసిఫేట్ ను 1 లీ. నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. కాయతొలుచు పురుగుల నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ., లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.



## సస్యరక్షణ



**మొవ్వ కాయ తొలుచు పురుగు :** విత్తిన 30 రోజుల నుండి క్షేత్రదశ వరకు ఆశిస్తుంది. దీని నివారణకు పురుగు ఆశించిన కొమ్మలను ఆ ప్రాంతం నుండి ఒక అంగుళం క్రిందకి తుంచి నాశనం చేయాలి. లీటరు నీటికి క్వినాల్‌ఫాస్ (లేదా) ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు కాయ కోసిన తర్వాత పిచికారీ చేయాలి.

**ఎర్రనల్లి :** పంట చివరి దశలో చిన్న, సన్నని ఎర్రనల్లి పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి, ఎక్కువ సంఖ్యలో రసాన్ని పీల్చి వేయడం వల్ల పాలిపోయి, ఆకులు తెల్లగా పండుబారుతాయి. దీని నివారణకు లీటరు నీటికి నీటిలో కరిగే గంధకపు పొడి 3 గ్రా. లేదా డైకోఫాల్ 5 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి





**తెల్ల దోమ :** పంటలో పూతకు ముందు చిన్న, పెద్ద పురుగులు ఆకుల అడుగు బాగాన చేరి రసాన్ని పీల్చి వేయడం వల్ల ఆకులు పసుపు రంగులోకి మారుతాయి . తర్వాత శంఖు రోగాన్ని వ్యాప్తి చేస్తాయి. వీటి తీవ్రత ఎక్కువైతే ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి పొలంలో అక్కడక్కడా పసుపు జిగురు అట్టలు పెట్టి తెల్ల దోమలను ఆకర్షింప జేసి తెల్లదోమలను నాశనం చేయాలి..

**బూడిద తెగులు :** ఆకులపైన మరియు అడుగు భాగాన బూడిద వంటి పదార్థంతో కప్పబడి ఉంటాయి. దీని నివారణకు లీటరు నీటికి 3 గ్రా. నీటిలో కరిగే గంధకం పొడి లేదా 1 మి.లీ డైనోకాప్ లేదా 2 మి.లీ. హెక్సాకోనజోల్ కలిపి పిచికారీ చేసుకోవాలి





**పల్లాకు (శంఖు) తెగులు :** చాలా వరకు సోకే అవకాశం ఉంది తెగులు సోకిన ఆకులు ఈనెలు పసుపు రంగుకు మారి, కాయలు గిడస బారి తెల్లగా పాలి పోతాయి. మొదటిగా దీనిని తట్టుకునే రకాలను ఎంచుకోవాలి. తెగులు వ్యాప్తిచేసే తెల్లదోమను నివారించుకొని తెగులు ఉధృతిని తగ్గించుకోవచ్చు.

**డా. వి. రాఘవేంద్రరెడ్డి, డా. కె. వెంకట సుబ్బయ్య, డా. వెంకట సతీస్, డా. జి.శాలిరాజు, డా. ఎ. దేవి వరప్రసాద్ రెడ్డి, డా. దీప్తి, డా. టి. విజయ నిర్మల, డా. ఇ. కరుణశ్రీ, కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట రామన్న గూడెం**

# ముల్లంగి

## స్వల్పకాలం - అధిక లాభం



స్వల్ప కాలంలో పంట చేతికొచ్చి అధిక ఆదాయాన్ని ఇచ్చే పంట ముల్లంగి.

**రకాలు :** ముల్లంగిని దుంప ఆకారం రంగును బట్టి ఎన్నో రకాలుగా విభజించారు, ముఖ్యంగా రైతులు తెలుపు రంగు దుంపలను ఎక్కువగా సాగు చేస్తున్నారు, రైతులు స్థానిక రకాలనే విత్తనంగా వాడుతున్నారు. ఈ మధ్యకాలంలో ముల్లంగిలో కూడా ఎన్నో రకాలు విడుదల చేశారు, రైతులు మార్కెట్ డిమాండ్ దృష్టిలో పెట్టుకొని సరియైన రకాన్ని ఎంచుకొని సాగు చేసుకోవాలి.

**జపనీస్ వైట్ :** చలికాలంలో సాగు వేసుకోవడానికి మిక్కిలి అనుకూలమైన రకం, స్వచ్ఛమైన తెలుపు రంగులో దుంపలు 20-30 సెంటీమీటర్ల పొడవులో ఉంటాయి ఎకరాకు 8 - 12 టన్నుల దిగుబడిని ఇస్తుంది,

**వైట్ ఐసికల్** విత్తిన 40 రోజుల్లో త్రవ్వకానికి వస్తుంది తక్కువ ఘాటు తో మంచి వాసనతో తినడానికి చాలా బాగా ఉంటుంది, దుంపలు మంచు తెలుపులో చివర్లు కొనదేలి ఉంటాయి,

**పూసాహిమని** దుంపలు తెల్లగా 30-35 సెంటీమీటర్ల పొడవులో ఉంటాయి . తీయని వాసనతో మధ్యస్థ ఘాటుతో దుంపలు ఉంటాయి,

**పూస చట్కి** పంటకాలం 50 - 60 రోజులు దుంపలు తెల్లగా ఒక మోస్తరు పొడవులో ఉంటాయి, తెల్ల తుప్పు తెగులను తట్టుకునే రకం, ఎకరాకి 8 10 టన్నుల దిగుబడిని ఇస్తుంది,

**హైబ్రిడ్ ముల్లంగి** చలికాలంలో పండించడానికి అనువైన రకం, దుంపలు 35-40 సెంటీమీటర్లు పొడవు ఉంటాయి దుంపలు ఒక మోస్తరు ఘాటు కలిగి రుచిగా ఉంటాయి.

**నేలలు** ముల్లంగి సాగుకు సారవంతమైన ఇసుకతో కూడిన నేలలు చాలా అనుకూలం మురుగునీటి వసతి కలిగి ఒక అడుగు లోతు వరకు గట్టిగా రాళ్లు లేని పొలాన్ని ఎన్నుకోవాలి, ఉదజని సూచిక 5.2 - 6.1 వరకు ఉన్న నేలలు చాలా అనుకూలం.

**వాతావరణం :** ముల్లంగి దుంపల నాణ్యత, అధిక దిగుబడికి 10 నుండి 15 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే మంచిది. ఎక్కువ ఉష్ణోగ్రతలో దుంపల పెరుగుదల లోపించి మొక్కలు ముందుగానే పూతకు వస్తాయి,

**విత్తన రేటు** ఎకరాకు రెండు నుంచి నాలుగు కేజీల విత్తనం సరిపోతుంది, నిత్యం ముల్లంగిని సంవత్సరంలో మూడు కాలాల్లోనూ అంటే జూన్, జులై, అక్టోబర్, నవంబర్, జనవరి, ఫిబ్రవరి నెలలో ప్రారంభించి సాగు చేసుకోవచ్చు,

**ప్రధాన పొలం తయారీ** సాగు పద్ధతి పొలాన్ని మూడు

నుండి నాలుగు సార్లు బాగా దున్ని చదును చేసుకోవాలి బోదెలు, కాలువలను తయారుచేసుకొని బోదెలుకు ఒకవైపున విత్తనం విత్తుకోవాలి 30 సెంటీమీటర్ల దూరంలో బోదెలు చేసి ఒక్కో బోదెకు 10 సెంటీమీటర్ల దూరంలో విత్తనాన్ని 1 సెంటీమీటర్ లోతులో విత్తాలి , విత్తిన వెంటనే పలుచగా నీరు పారించాలి,

**నీటి యాజమాన్యం :** నేల స్వభావం వాతావరణాన్ని బట్టి 4 నుండి 6 రోజులకు ఒకసారి నీరు పెట్టాలి, ఎరువులు వేసిన ప్రతిసారి తడి నివ్వాలి, ముల్లంగికి నీరు ఎక్కువగా అవసరం లేకపోయినా నేల మరీ ఎండిపోయినట్లు ఉండకూడదు దీనివల్ల దుంపలు ఎదగక ఎక్కువ ఘాటు కలిగి ఉంటాయి,

**ఎరువుల యాజమాన్యం :** ఆఖరి దుక్కులో బాగా చివికిన పశువుల ఎరువు 10 టన్నులు ఒక ఎకరానికి వేసి కలియుదున్నాలి. పశువుల ఎరువుతో పాటు 15 కిలోల నత్రజని, 15 కిలోల భాస్వరం, 15 కిలోల పొటాష్ ఎరువులను కూడా వెయ్యాలి, రెండవ దఫా నత్రజని విత్తిన 25 రోజులకు వేసి మట్టిని ఎగద్రోయాలి,

**సస్యరక్షణ** పేను బంక ఆకులు అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడం వలన ఆకులు వాడిపోతాయి, నివారణకు డైమిథోయేట్ రెండు మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**కోత :** రకాన్ని బట్టి 50 – 60 రోజులకు పంట కోతకు వస్తుంది కోతకు ముందు పొలంలో నీరు పెట్టి తర్వాత మొక్కల్ని పీకాలి, ఆకులను కోసి దుంపలను నీటిలో కడిగి ఆరబెట్టాలి,

**దిగుబడి :** సాధారణ రకాలు ఎకరానికి 6 – 8 టన్నులు సంకరజాతి రకాలు ఎకరానికి 12 – 16 టన్నులు దిగుబడి వస్తుంది

## ఆరోగ్య ప్రయోజనాలు

- జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది
- అధిక బరువును నియంత్రిస్తుంది
- మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది
- రక్తంలో చక్కెర శాతాన్ని నియంత్రిస్తుంది
- ఇందులో ఉన్న యాంటీ ఆక్సిడెంట్ల వలన గుండెకు మేలు చేస్తుంది.
- విటమిన్–సి, బి, కాల్షియం, ఐరన్, పొటాషియం పుష్కలం



- లివర్‌కు మేలు చేస్తుంది
- జలుబు, దగ్గు తరచూ రాకుండా నివారిస్తుంది
- నీటి శాతం అధికంగా ఉండడం వల్ల శరీరాన్ని చల్లగా ఉంచుతుంది

**డా. వి. రాఘవేంద్రరెడ్డి, డా. కె. వెంకట సుబ్బయ్య, డా. వెంకట సతీస్, డా. జి.శాలిరాజు, డా. ఎ. దేవి వరప్రసాద్ రెడ్డి, డా. దీప్తి, డా. టి. విజయ నిర్మల, డా. ఇ. కరుణశ్రీ, కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట రామన్న గూడెం**



# కొమ్మ కత్తిరింపులు

రాష్ట్రంలో జామ ఎక్కువగా అనంతపురం, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కడప జిల్లాలలో ఎక్కువగా సాగులో ఉంది. జామ లో ముఖ్యంగా ఎక్కువ దిగుబడులకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల్లో కత్తిరింపులు, పోషక యాజమాన్యం చాలా ప్రాముఖ్యత సంతరించుకుంది

**కత్తిరింపులు** ప్రధాన కాండంపై 2 – 3 అడుగుల ఎత్తు వరకు వచ్చే పక్క కొమ్మలను కత్తిరించి వేయాలి 60 లేదా 90 సెంటీమీటర్ల పైన 2 లేదా 3 కొమ్మలను మాత్రమే పెరిగేటట్లు చూడాలి, ప్రతి సంవత్సరం ఎండిను కొమ్మలను, అడ్డంగా పెరిగే కొమ్మలను తీసివేయాలి. గత సంవత్సరం లేదా కాపు కోసిన తర్వాత కొమ్మలను నాలుగింట 3వంతులు కత్తిరిస్తే ప్రక్క కొమ్మలు ఎక్కువగా వచ్చి కాపు బాగా వస్తుంది. కాయలు కోసినప్పుడు చిన్న చిన్న రెమ్మలతో కోయడం మంచిది. కాపు నియంత్రణలో భాగంగా కాపు పూర్తయిన తర్వాత 50% వరకు కొమ్మలను కత్తిరించాలి ఈ విధంగా చేయడం వలన వర్షాకాలంలో వచ్చే కాపును నియంత్రించవచ్చు. మొక్కను అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తున్నప్పుడు అధిక దిగుబడి మరియు నాణ్యమైన ఫల సాయం కొరకు కత్తిరింపులు తప్పనిసరిగా చేయాలి.



మొక్క కాండంపై 30 నుండి 40 సెంటీమీటర్ల వరకు కొమ్మలు పెరగనివ్వరాదు మొక్కలు నాటిన 2 నుంచి 3 నెలల తర్వాత 30 నుంచి 40 సెంటీమీటర్లు ఎత్తులో ప్రధాన కాండాన్ని కత్తిరించి వేయాలి, తర్వాత 15 నుంచి 20 రోజులకు కొత్త చిగుళ్ళు వస్తాయి. వీటిలో 3 నుంచి 4 కొమ్మలు ఉంచి మిగతా కొమ్మలను తీసివేయాలి. 3 నుంచి 4 నెలల తర్వాత ముదిరిన ఈ కొమ్మలను 50% వరకు కత్తిరించాలి. కత్తిరించిన భాగం నుండి కొత్త కొమ్మలు వస్తాయి, ఈ కొమ్మలను 3 నుంచి 4 నెలల తర్వాత మరోసారి 50% వరకు కత్తిరించాలి. ఈ కొమ్మలకు పూత, పిందె ఏర్పడుతుంది. ఈ విధంగా సంవత్సరానికి 3 సార్లు కొమ్మ కత్తిరింపులు చేయడం ద్వారా మొక్క పెరుగుదలను నియంత్రించి ప్రతి కొమ్మలో పూత, పిందె ఏర్పడినట్లు చేయవచ్చు. ఈ విధంగా ఒక సంవత్సరం తర్వాత కొమ్మ కత్తిరింపులను మే-జూన్, సెప్టెంబర్-అక్టోబర్ మరియు జనవరి-ఫిబ్రవరి మాసాలలో చేపట్టాలి. ఈ అధిక సాంద్రత పద్ధతిలో చెట్లు నాటిన మొదటి సంవత్సరంలోనే కాపునకు వస్తుంది. **గమనిక:** కత్తిరింపు తరువాత కార్బండిజం 1 గ్రా లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.



**పోషక యాజమాన్యం** జామకు సిఫార్సు చేసిన ఎరువులను మొక్క వయసును బట్టి క్రమబద్ధంగా వేసి జామలో అధిక దిగుబడులు మంచి నాణ్యత గల పండ్లను సాధించవచ్చును. మొదటి సంవత్సరం 100 గ్రాములు నత్రజని, 40 గ్రాములు బాస్వరం, 100 గ్రాముల పొటాష్, 15 కిలోల పశువుల ఎరువు వేయాలి రెండవ సంవత్సరం 200 గ్రాముల నత్రజని, 80 గ్రాములు భాస్వరం, 30 గ్రాముల పొటాష్, 30 కిలోల పశువుల ఎరువు వేసుకోవాలి. మూడో సంవత్సరం 300 గ్రాముల నత్రజని, 120 గ్రాముల భాస్వరం, 300 గ్రాముల పొటాష్, 45 కిలోల పశువుల ఎరువు వేసుకోవాలి. నాలుగవ సంవత్సరం 400 గ్రాములు నత్రజని, 160 గ్రాముల భాస్వరం, 400 గ్రాముల పొటాస్, 60 కిలోల పశువుల ఎరువు వేసుకోవాలి. అయిదవ సంవత్సరం ఆ పైన 500 గ్రాముల నత్రజని, 200 గ్రాములుబాస్వరం, 500 గ్రాముల పొటాష్, 100 కిలోల పశువుల ఎరువు వేసుకోవాలి.



పైన తెలిపిన ఎరువులను రెండు దఫాలుగా జూన్ మరియు సెప్టెంబర్ మాసాలలో వేయాలి. సిఫార్సు చేసిన ఎరువులను 50% యూరియా, 100% బాష్వరం, 50% పొటాష్ ఎరువులను జూన్ మాసంలో వేయాలి మిగిలిన 50 శాతం యూరియా 50% పొటాష్ ను సెప్టెంబర్ మాసంలో వేయాలి. నత్రజని లో సగభాగాన్ని పశువుల ఎరువు లేదా వేపపిండి రూపంలో ఇవ్వవచ్చు. తేలికపాటి నేలల్లో వర్షాధారంగా ఉన్న జామలో పోషక లోపాలు ఎక్కువగా కనిపిస్తాయి. తేలికపాటి నెలలో సేంద్రియ ఎరువులు వేయడం ద్వారా ఈ లోపాలు నివారించవచ్చును. పిందే కాయగా మారే దశలో ఒకటి లేదా రెండు శాతం యూరియా ద్రావణం పిచికారీ చేయడం వల్ల కాయ పరిమాణం పెరిగి అధిక దిగుబడి వస్తుంది. పోషకాల లోప నివారణకు 4 గ్రాముల జింక్ సల్ఫేట్ తో పాటు 2 గ్రాముల బోరిక్ యాసిడ్ 1 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి సూక్ష్మ పోషకాల లోప నివారణకు ముఖ్యంగా జింక్ సల్ఫేట్ 25 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ 25 గ్రాములు, బోరాక్స్ 25 గ్రాములు మిశ్రమాన్ని 5 లీటర్ల నీటికి కలిపి కొత్త చిగుళ్ళు వచ్చే సమయంలో రెండోసారి మొదటి పిచికారీ తర్వాత నెల రోజులకు చేయాలి మూడోసారి పూత సమయంలో నాలుగో ఒకసారి కాయ కట్టే సమయంలో పిచికారీ చేసుకుని సూక్ష్మ పోషకాల లోపాన్ని సవరించవచ్చు.



డా. కె. వెంకటసుబ్బయ్య, డా. జి. శాలిరాజు, డా. కె. వెంకట సతీష్, డా. ఎం. రాఘవేంద్ర రెడ్డి, డా. ఎం. దేవి వరప్రసాద్ రెడ్డి, డా. టి. విజయనిర్మల, డా. వి. దీప్తి, డా. ఈ. కరుణశ్రీ, కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట రామన్న గూడెం.

# తరాలుగా తరగని కల్పవృక్షం



గ్రామీణ భారతంలో అత్యంత ప్రాధాన్యత గల వృక్షం తాటి చెట్టు బహుళార్ధ ప్రయోజనకారి తాటి చెట్టు.

**ప్రాముఖ్యత:**

తాటి చెట్టు భాగాలలో పనికిరానిది ఏదీ లేదు.

1. తాటి ఆకులను ఇళ్లకప్పులకు, పందిళ్లకు వాడతారు.
2. తాటి మొదలు (కాండం) దూలాలుగా, దంతులుగా వాడతారు.
3. తాటికమ్మలనుండి నార తీసి గ్రామీణులు జీవనోపాధి పొందుతున్నారు.
4. విసనకర్రలు, బుట్టలు అందమైన అలంకరణ సామాగ్రి, టోపీలు తయారీలో వాడతారు.
5. తాటిచెట్టు నుండి లభించే ముంజెలు, తేగలు ఆరోగ్యకరమైన ఆహారం. తాటిగెలలనుండి ఊరే నీరు (రసం) నుండి తాటిబెల్లం, పంచదార, కాండీలు తయారుచేస్తున్నారు. ఇవి మధుమేహ వ్యాధిగ్రస్తులకు వరం లాంటిది.
6. తాటి నుంచి కల్లు తీయుట వలన కొన్ని లక్షలమంది గీతకార్మికులు లబ్ధిపొందటమే కాక ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది.
7. తాటిపండ్ల గుజ్జును కాగితం పరిశ్రమలో ఉపయోగిస్తున్నారు.
8. తాటి డొప్పలు, మిగిలిన భాగాలు వంటచెరుకుగా ఉపయోగిస్తున్నారు.



**వివిధ సమయాలలో వచ్చే ఉత్పత్తులు:**

**నీరా:** నీరా నుండి పంచదార, బెల్లం, పటిక బెల్లం, పంచదార పాకం, చాక్లెట్లు మరియు ఐస్‌క్రీమ్ వంటివి తయారు చేస్తారు.

1. నీరా జీర్ణశక్తిని, ఆకలిని పెంచుతుంది.
2. ఉబ్బసం, రక్తహీనత వంటి రోగాలను టానిక్ గా ఉపయోగపడుతుంది.
3. నిలువ ఉంచితే పులిసి ఆరోగ్యానికి హాని కలుగజేస్తుంది.
4. క్షయ మరియు ఇతర దగ్గులను పోగొడుతుంది.

**తాటి బెల్లం :** ప్రకృతి సిద్ధంగా పెరుగు తాటిచెట్ల నుండి లభించిన నీరా నుండి తాటి బెల్లం తయారు చేస్తారు. నీరా అనేది ఆడ మరియు మగ చెట్ల నుండి లభిస్తుంది. ఈ తాటిబెల్లం విశిష్టత గురించి 100 సం,, క్రితం వస్తుగుణదీపికలో తెలియజేయడం జరిగింది. తాటి బెల్లం క్రమం తప్పకుండా 20 గ్రా ఆహారంగా తీసుకుంటే అనేక రకాల వ్యాధులు నయమవుతాయి. ముఖ్యంగా స్త్రీలలో, చిన్నపిల్లలో రక్తహీనతను తగ్గించడానికి ఉపయోగపడుతుంది. తాటి బెల్లాన్ని వాడుట వలన వీర్యపుష్టి, దేహపుష్టి కలుగుతుంది. ఇందులో నీటి శాతం 0.7. కొవ్వు పదార్థాలు 0.04%, ఖనిజలవణాలు 0.3%, కార్బోహైడ్రేడ్స్ 98.73%, ఫాస్పరస్ 5.4%, ఇనుము 1.4%, కెలోరిఫిక్ విలువ 396 కేలరీలు ఒక గ్రాముకు, బోపైల్ 100 గ్రా కి 8.2 కలదు. నీరా నుండి తాటిబెల్లం, తాటి పంచదార, తాటి కలకండ తయారుచేయవచ్చు.

**ముంజెలు:** జెల్లిలాగా వుండే తాటికాయ లోపలి భాగమును ముంజె అంటారు. ముంజెలు కోసం తాటికాయను దాదాపు 60-70 రోజులకు కోయవలెను. అప్పుడు కాయ నల్లగావుండి కాడ వద్ద పసుపు రంగు కలిగి ఉంటుంది. వేసవికాలము చల్లదనాన్ని ఇస్తుంది.



**తాటిగుంజు:** విత్తనం మొల కెత్తునపుడు ఇది తయారవు తుంది. ఇది మెత్తగా మరియు తియ్యగా వుంటుంది. గ్రామా లలో దీనిని బుర్రగుంజు అంటారు. దీని పరిమాణము రోజులు గడిచేకొద్ది తగ్గుతూ వుంటుంది. సమారు 90 రోజులకు పూర్తిగా కరిగిపోతుంది. సరాసరి దీని బరువు 25-30 గ్రా,, వుంటుంది. ఇందులో ప్రొటీను అధికంగా వుంటుంది.

**తాటి పండ్లు:** తాటి పండ్లు పూర్తిగా పరిపక్వత చెంది సెప్టెంబరు, అక్టోబరు నెలలో రాలుతాయి. అక్టోబరు చివరకు దాదాపు మొత్తం రాలిపోవడానికి సిద్దమవుతాయి. దీనిలో దాదాపు 75-80 శాతం మూడు టెంకలు గల పండ్లు ఉంటాయి. మిగిలిన వాటిలో 15 శాతం వరకు రెండు టెంకలుగలవి, 5 శాతం ఒక టెంకగలవి. ఉంటాయి. ఈ పండ్ల నుండి తాటి ఇడ్లీ, తాటి రొట్టె వంటి ఆహార పదార్థాలు, ఆల్కహాలు తయారుచేయవచ్చును.



**తేగలు:** పరిణితి చెందిన తేగలు పెళుసుగా ఉండి సులభంగా విరుగుతాయి. మొదట పీచు పదార్థాలు అధికంగా ఉండి పరిణితిచెందే కొద్దీ తగ్గుతూ ఉంటుంది. తేగలు పిండిపదార్థం అధికంగా కలిగి వుంటాయి. తేగలను కోయడానికి తగిన సమయం నాటిన తరువాత దాదాపు 135 రోజులు. తేగల సరాసరి పరిమాణం 90-100గ్రా, కలిగి ఉంటుంది. తేగలను ఉడకబెట్టి లేదా కాల్చి తినవచ్చు. వీటినుండి అనేక రకాలయిన ఆహార పదార్థాలు తయారుచేయవచ్చును.



**తాటి పీచు:** తాటి ఆకు నుండి కాడకుగల చివరిభాగాన్ని కమ్మ అంటారు. ఇది చెట్టుకు అతుక్కుని ఉంటుంది. ముదురు ఆకులకు ఇది బలంగా వుండి ముదురు రంగులో వుండి, నల్లటి పీచు ఉంటుంది. ఈ పీచు చాలా గట్టిది మరియు ఆమ్ల, క్షారాలను తట్టుకొని, కీటకాలను, పురుగులకు, నీటికి కూడా తట్టుకొనే నిరోధక శక్తి ఉంది. అందువలన మిగిలిన అన్ని పీచులకంటే దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. దీనిని పరిశ్రమలు, స్థానికంగా శుద్ధిచేయుటకు బ్రష్‌లకు విరివిగా వాడుతారు.

**వ్యవసాయంలో తాటిచెట్ల ప్రభావం:** 1. తాటిచెట్లను కంచెగా వేసుకొంటే దాని ప్రభావం ప్రక్కనున్న పైరుమీద పడదు. 2. నీటి ఎద్దడి, ముంపుగాని, నీటి నిలువ మొ॥ పరిస్థితులు, తాటిచెట్లు మనుగడపై పెరుగుదలపై ఏ మాత్రం పడదు. 3. తాటిచెట్లు నిలువుగా పెరుగుతాయి. వీటి మొదలు బలంగా ఉండటం వలన జీవకంగా గాలిని నిరోధించేందుకు వేసుకోవచ్చు. 4. ఇతర మొక్కల వేళ్ళతో ఏమాత్రం పోటీపడదు కనుక మిశ్రమ పంటగా వేయవచ్చు లేదా గట్లమీద వేసుకోవచ్చు. 5. నీటి ముంపుని, నీటి ఎద్దడిని సమర్థంగా ఎదుర్కొంటుంది, ఏ నెలలో అయినా పెరుగుతుంది.




**డా.పి.సి.వెంగయ్య, డా.కె.రాజేంద్ర ప్రసాద్,**
**అఖిల భారత తాటి పరిశోధన పథకం**
**ఉద్యాన పరిశోధన స్థానం, పందిరిమామిడి.**






# ఏడాదంతా సాగుచేసే ప్రొద్దుతిరుగుడు

రాష్ట్రంలో ప్రొద్దుతిరుగుడు చాలా ముఖ్యమైన నూనె గింజల పంట ఈ పంటను కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోనూ, ఉత్తరకోస్తా జిల్లాల్లో వరి మాగాణుల్లో సాగు చేస్తారు.

ప్రొద్దుతిరుగుడు నూనెలో లినోలిక్ ఆమ్లం (66%) ఎక్కువగా ఉండటం వలన మంచి ఆరోగ్యకరం, నూనె తీసిన తర్వాత వచ్చిన పిప్పిలో కూడా అధికంగా మాంసకృత్తులు ఉండడం వలన పశువులకు, కోళ్లకు దాణాగాను ఉపయోగిస్తారు. ఏడాది పొడవునా సాగు చేసుకోవచ్చు

**అనువైన రకాలు :** ఎన్ డి ఎస్ హెచ్ 1012, ఎన్ డి ఎస్ హెచ్ 1, కేడి ఎస్ హెచ్ 44, డి ఆర్ ఎస్ హెచ్ 1.

**అనువైన నేలలు** నీరు నిలువ ఉండని తటస్థ భూములైన ఎర్రచల్క, ఇసుక, రేగడి, ఒండ్రు నేలలు అనుకూలం

**విత్తన మోతాదు :** వర్షాధార పంటకు హెక్టారుకు 5-6 కేజీలు, నీటిపారుదల పంటకు హెక్టారుకు 4 – 5 కేజీల విత్తనం సరిపోతుంది.

**విత్తన శుద్ధి :** నెక్రొసిస్ వైరస్ అధికంగా ఉన్న ప్రాంతాలలో కిలో విత్తనానికి థయోమిథాక్సామ్ 4 గ్రాముల మందును లేదా ఇమిడాక్లోరోపిడ్ 5 గ్రాములు కలిపి విత్తన శుద్ధి చేయాలి. ఆల్టర్నేరియా ఆకు మచ్చ తెగులు ఉన్న ప్రాంతాలలో కిలో విత్తనానికి ఇప్రోడియాన్ 25%, కార్బండిజమ్ 25 % లేదా కార్బండిజమ్ 12%, మాంకోజెబ్ 63% 2 గ్రాముల చొప్పున మందులు కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.

**ఎరువులు :** పంటను విత్తే 2 నుంచి 3 వారాల ముందు ఎకరానికి మూడు టన్నుల బాగా చివికిన పశువులు ఎరువులు వేసి కలియదున్నాలి, భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా సిఫార్సు చేసిన మోతాదులో పోషకాలు వాడాలి. వర్షాధార పంటకు 60:60: 30 కిలోలు నత్రజని, భాస్వరం, పొటాష్ నిచ్చే ఎరువులను వేసుకోవాలి. సగం నత్రజని, మొత్తం భాస్వరం, పొటాష్ ఎరువులను ఆఖరి దుక్కులో వేయాలి. మిగతా సగం నత్రజని 30 రోజుల తర్వాత పై పాటుగా వేసుకోవాలి. నీటిపారుదల పంటకు 75: 90: 30 కిలోల





హెక్టారుకు నత్రజని, భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులను వెయ్యాలి. అయితే నత్రజని మూడు దఫాలుగా ఇచ్చేటప్పుడు 30 రోజుల తర్వాత 50 రోజుల తర్వాత వేసుకోవాలి. పై పాటుగా ఎరువులు వేసేటప్పుడు నేలలో తగినంత తేమ ఉండేటట్లు చూసుకోవాలి. నూనె గింజ పంటల్లో నూనె శాతం కొరకు గంధకం ఎరువులను వాడాలి, కాబట్టి భాస్వరం ఎరువులను సింగిల్ సూపర్ ఫాస్పేట్ రూపంలో వాడడం వలన పైరుకి గంధకం కూడా లభిస్తుంది. గంధకం తక్కువగా ఉన్న ప్రాంతాలలో హెక్టార్ కి 25 కిలోల గంధకాన్ని జిప్సం ఎరువు రూపంలో వేసుకోవచ్చు. బొరాక్స్ ను 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పైరు పూత దశలో పువ్వులు తడిచేలా పిచికారీ చేయాలి. జింక్ ధాతు లోప నివారణకు 2 గ్రాముల జింక్ సల్ఫేట్ ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**కలుపు నివారణ :** అంతర కృషి పంట విత్తిన మొదటి 4 -6 వారాలు కలుపు నివారణకు కీలకమైనవి ఈ దశలో కలుపు లేకుండా చూసుకోవాలి. విత్తేముందు ఫ్లూక్లోరాలిన్ 2.5 లీ/హె, లేదా పెండిమిథాలిన్ 2.5 లీ/హె, లేదా అలాక్లోర్ 3.75 లీ/హె, మందులను విత్తిన వెంటనే కానీ మరుసటి రోజు కానీ పిచికారీ చేయాలి. ఆ తరువాత 30 నుంచి 45 రోజులు వరకు ఒకసారి చేతితో కలుపు తీసి గొర్రుతో అంత కృషి చేయాలి.

**నీటి యాజమాన్యం :** నేల స్వభావాన్ని బట్టి 4 నుంచి 6 తడులు పంటకు అవసరం. తేలికపాటి నేలల్లో 8 నుంచి 10 రోజులు వ్యవదిలో, నల్లరేగడి నేలల్లో 15 రోజుల వ్యవధిలో తడులు ఇవ్వాలి. అవసరాన్ని మించి తడులు ఇవ్వడం వలన తెగుళ్ళు సోకే అవకాశం ఉంది.

**అంతర పంటలు :** కంది, వేరుశనగ, ఆముదం, పంటలతో అంతర పంటలుగా సాగు చేసుకొనవచ్చు.

నెక్రోసిస్ తెగులు ఏ దశలోనైనా ఆశించే ప్రమాదకరమైన తెగులు, మొదట ఆకుల మీద నెక్రోసిస్ మచ్చలుగా ప్రారంభమై తరువాత ఆకులు వంకర్లు తిరుగుతాయి. మొక్కలు గిడసబారి పోతాయి. కలుపు మొక్కలు (వయ్యారిభామ) తామర పురుగులు లేకుండా చూసుకోవాలి. ముందుగా విత్తన శుద్ధి తప్పనిసరి. పంట చుట్టూ నాలుగు సాళ్ళు జొన్న, మొక్కజొన్న పంటలలో ఏదో ఒక దానిని కంచె పంటగా వేసుకోవాలి.

**దిగుబడి** వర్షాధార పంటకు 800– 1000 కిలోలు, నీటి దారుదల పంటకు 2000 – 2500 కిలోలు హెక్టారుకు దిగుబడి వస్తుంది.

డా. కె. ప్రభాకర్, డా. బి. వి. ఆర్. ప్రకాష్ రెడ్డి,
డా. కె. వెంకటరమణమ్మ,
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నంద్యాల






సాంప్రదాయానికి భిన్నంగా.. వినూత్నంగా ఆలోచిస్తే.. పంటలు సాగు చేస్తే లాభాల బాట పట్టవచ్చని నిరూపిస్తున్నారు ఓ రైతు రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మాత్రమే పండే మిరియాలను షేడ్‌నెట్ కింద సాగుచేసి విజయం సాధించారు... తూర్పు గోదావరి జిల్లా, చాగల్లు మండలం, కలవలపల్లి గ్రామ, రైతు ముళ్ళపూడి మురళీకృష్ణ.. ఆయన తనకున్న 60 సెంట్ల పొలంలో షేడ్ నెట్ కింద 8 అడుగుల దూరం ఉండేలా 360 సిమెంట్ స్తంభాలు (ఎక్కువ కాలం నిలిచేందుకు) వేసి కేరళ నుంచి 'ఆర్థో టాప్ మిరియం" (ఏడాదిన్నరకు దిగుబడి వస్తుంది) మొదట్లో 100 మొక్కలు తెచ్చి ఒక్కో స్తంభానికి 4 మొక్కలు చొప్పున నాటారు. క్రమేణా 1800 మొక్కలు తెచ్చారు. పొలాన్ని ఎత్తు మడులుగా చేసి ఆచ్ఛాదన కోసం మల్చింగ్ షీట్ వేశారు. ఒక్కో మొక్కకు రెండు లీటర్ల నీరు వంతున, రోజుకు నాలుగు గంటలు నీరు ఇస్తూ.. జీవన ఎరువులతో సాగు చేశారు. ఒక మీటరు స్తంభం వేసుకుంటే ఒక కేజీ, రెండు మీటర్లు స్తంభం వేసుకుంటే రెండు కేజీల డిగుబడి వస్తుంది. ఒక్కో గుత్తి లో ఒక్క కాయ ఎర్ర రంగుకు వచ్చినా అది కోతకు సిద్ధమయి నట్టు గుర్తించవచ్చు. ఇలా కోసిన గుత్తులను ఒక చిన్న మెషిన్లో వేస్తే కాయలన్నీ వేరవుతాయి. వాటిని కొద్దిసేపు వేడి నీటిలో ఉంచితే నల్ల రంగు మిరియాలు సిద్ధం.

మరో రకం మొక్కలు " రన్నర్ షూట్ " మూడున్నర ఏళ్లకు డిగుబడి వస్తుంది. దీన్ని సంప్రదాయ పద్ధతిలో చెట్లకు ఎక్కించడం ద్వారా సాగు చేస్తారు.

మూడో రకం "బుష్ పెప్పర్" అన్నది ఒక నెలకే కాపునకు వచ్చి ఏడాదంతా ఫలసాయం ఇస్తుందని రైతు చెప్పారు. ఇది వక్క తోటల్లో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. నేలమీదే తీగలా పాకుతుంది. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు సాగు చేయవచ్చు.

ఏడాది గడిచేసరికి కాపు ప్రారంభం అయింది. తరవాత నాలుగు నెలలకు కోతకు సిద్ధం అయింది. ఏడాదికి రెండు పంటల ద్వారా 500 కిలోల దిగుబడి సాధించారు. నిడదవోలు, రాజమండ్రి మార్కెట్లలో కిలో రూ. 600 చొప్పున విక్రయించారు. కోతకు వచ్చిన మిరియాల కంకులు మన చేతికి అందే ఎత్తులో ఉంటాయి కనుక కోతలో శ్రమ తక్కువ. ఈ రకం మొక్కలు కొమ్మ కిందకు వాలకూడదు.. ఎప్పటికప్పుడు కొమ్మ కత్తిరింపులు చేయాలి. చుట్టుపక్కల ఎక్కడా ఇలాంటి పంట లేకపోవడం వల్ల ఈ పంటకు సహజంగా వచ్చే ఫైటోఫ్తెరా, వేరుకుళ్ళు తెగుళ్ల ఆశించలేదు. షేడ్ నెట్ లో 35 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత ఉండేందుకు మురళీ కృష్ణ రెండో నెట్ కూడా వేశారు. 'ఆర్థో టాప్ మిరియం" మొక్కలను ఈ రైతు తన క్షేత్రంలో పెంచి కావలసిన రైతులకు ఒక్కో మొక్క రూ. 40 నుంచి రూ. 50 కి ఇస్తున్నారు.

**ఆర్బీకే ఛానల్ సౌజన్యంతో :**

**ముళ్ళపూడి మురళీ కృష్ణ (94405 83725)**

**యూట్యూబ్ లింక్ కొరకు :**

https://youtu.be/s8K17cmpTAQ



# సమీకృత రైతు సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నంబరు 155251 కు రైతుల ప్రశ్నలు - సమాధానాలు

## వ్యవసాయ పంటలు

1) రైతుపేరు: వీరారెడ్డి, గ్రామం: బండగానిపల్లి, మండలం: ఉదయగిరి, జిల్లా: యస్.పి.యస్.ఆర్ నెల్లూరు, ఫోన్ నెంబర్: 9490463540.

**ప్ర: సజ్జ పంట వేయాలి అనుకుంటున్నాను, ఏ సమయంలో విత్తుకోవాలో, మేలైన రకాలను తెలుపగలరు ?**

జ: సజ్జను ఖరీఫ్ పంటగా జూన్ నుంచి జూలై వరకు విత్తుకోవచ్చు. హెచ్.హెచ్.బి 67, ఐ.సి.యం.హెచ్. 356 మరియు ఏ.బి.వి 4 అను రకాలు వెర్రి కంకి తెగులను తట్టుకొంటాయి.

2) రైతు పేరు: రామచంద్రారెడ్డి, గ్రామం: బక్కాయపల్లి, మండలం: కాజీపేట, జిల్లా: వై.యస్.ఆర్ కడప, ఫోన్ నెంబర్: 9441270710.

**ప్ర: వేరుశనగలో ఆకుల అడుగు భాగంలో ఇటుక రంగు గల చిన్న పొక్కులు ఏర్పడి ఆకు పైభాగంలో పసుపు రంగు మచ్చలు కనిపిస్తున్నాయి, నివారణ తెలపండి ?**

జ: వేరుశనగలో తుప్పుతెగులు నివారణకు క్లోరోథలోనిల్ 2 గ్రా. లేదా మాంకోజెబ్ 2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలుపుకొని మొక్కలు తడిచే విధంగా పిచికారీ చేసుకోవాలి.

3) రైతు పేరు: రామకృష్ణ , గ్రామం : మాధవరం, మండలం : ప్యాపిలి, జిల్లా : నంద్యాల, ఫోన్ నెంబర్ : 9100198961.

**ప్ర: మొక్కజొన్న పంటను ఏ సమయంలో విత్తుకోవాలో చెప్పగలరు?**

జ: మొక్కజొన్న వర్షాధారపు పంటగా జూన్ 15 నుంచి జూలై 15 వరకు విత్తుకోవచ్చు.

4) రైతు పేరు : షేక్ మాబు, గ్రామం : కోటలపల్లె, మండలం: వెలిగండ్ల, జిల్లా : ప్రకాశం, ఫోన్ నెంబర్ : 7729022619.

**ప్ర: ఖరీఫ్ లో సాగుకు అనుకూలమైన కంది రకాలను తెలుపగలరు?**

జ: ఎల్.ఆర్.జి 30 (పల్నాడు), ఎల్.ఆర్.జి 105 (కృష్ణ), ఎల్.ఆర్.జి 133-33 (సౌభాగ్య), ఐ.సి.పి.యల్ 87119 (ఆశ), ఐ.సి.పి.యల్ 332 (అభయ), ఐ.సి.పి.యల్ 8863 (మారుతి) అనే కంది రకాలు ఖరీఫ్ లో సాగుకు అనుకూలము.

5) రైతు పేరు: వర్మరాజు, గ్రామం : కుమరాం, మండలం: గరివిడి, జిల్లా: విజయనగరం, ఫోన్ నెంబర్: 8688400480.

**ప్ర: చెఱకులో ఆకులు నారింజ రంగులోకి మారి మొక్కలు గిడసబారి పోతున్నాయి. ఏమి పిచికారీ చేసుకోవాలో చెప్పండి?**

జ: చెఱకులో తెల్లదోమ నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా డైమిథోయేట్ 1.7 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి 10 -12 రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

6) రైతు పేరు: సత్యనారాయణ, గ్రామం: ఈదులముష్టూరు, మండలం : బత్తలపల్లి, జిల్లా : అనంతపురం, ఫోన్ నెంబర్ : 6281344491.

**ప్ర: అలసంద పంటలో కాయతొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తుంది, సాగుకు మేలైన రకాలను తెలియజేయగలరు?**

జ: అలసందలో డి.సి 15 అనే రకం 75-80 రోజులకు పంటనిస్తుంది. ఎకరాకు 25-30 క్వింటాళ్ళ దిగుబడితో వర్షాధారం మరియు నీటి వసతి ఉన్న చోట్ల అన్ని నేల రకాలలో సాగుకు అనుకూలం. పేనుబంక మరియు కాయతొలుచు పురుగులను తట్టుకుంటుంది. వడలు తెగులు మరియు పల్లాకు తెగులును కొంతవరకు తట్టుకోగలదు.

7) రైతు పేరు: శివయ్య, గ్రామం: మిట్టకందల, మండలం: పాములపాడు, జిల్లా: నంద్యాల, ఫోన్ నెంబర్: 9703734474.

**ప్ర: ఆముదం పంట వేయాలనుకుంటున్నాను, విత్తనశుద్ధి ఏ విధంగా చేయాలో తెలుపగలరు ?**

జ: కిలో ఆముదం విత్తనానికి 3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ లేదా 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడి కలిపి విత్తనశుద్ధి చేసి విత్తుకుంటే బాగుంటుంది. మొలక కుళ్ళు తెగులు, ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు మరియు కొంతవరకు వడలు తెగులును అరికట్టవచ్చు.

# ఉద్యానశాఖ

1) రైతు పేరు: ఎం. తిరుపతి, గ్రామం: మత్రిపాడు, మండలం: తిక్కవరం, జిల్లా: నెల్లూరు, ఫోన్ నెంబర్: 6304591592.

**ప్ర: నిమ్మలో కాయలపై తెల్లని గోకిన మచ్చలు ఏర్పడ్డాయి. నివారణ తెలుపగలరు?**

జ: నిమ్మలో తామరపురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయండి.

2) రైతు పేరు: పెదబెంగి సర్వేశ్వరయ్య, గ్రామం: గోశానపల్లె, మండలం: డోన్, జిల్లా: నంద్యాల, ఫోన్ నెంబర్: 9492053554.

**ప్ర: ఉల్లిగడ్డ వృద్ధి చెందుతున్న దశలో గడ్డకుళ్ళు తెగులు నివారణ చెప్పగలరు?**

జ: ఉల్లిలో గడ్డకుళ్ళు నివారణకు కార్బండిజమ్ 1 గ్రా. చొప్పున లీటరు నీటికి కలుపుకొని మొక్కలు పూర్తిగా తడిచేటట్లుగా వారం రోజుల వ్యవధితో పిచికారీ చేసుకోవాలి. అదేవిధంగా ఉల్లిగడ్డ వృద్ధి చెందడానికి మల్టి-కె 5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి మొక్కలు పూర్తిగా తడిచేటట్లుగా వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

3) రైతు పేరు: చిట్టిబాబు, గ్రామం: చిప్పాడ, మండలం: భీమునిపట్నం, జిల్లా: విశాఖపట్నం, ఫోన్ నెం: 8297982345.

**ప్ర: కరివేపాకులో ఆకుతినే పురుగు మరియు ఆకులపై మచ్చలు ఏర్పడుతున్నాయి. నివారణ చెప్పండి?**

జ: కరివేపాకులో ఆకుతినే పురుగు నివారణకు మలాథియాన్ 2 మి.లీ. మరియు కార్బండిజమ్ 1 గ్రా. చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేయవలెను. 4 రోజుల తరువాత మొక్క ఎదుగుదలకు 19:19:19 5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలుపుకొని వారం రోజుల వ్యవధితో రెండు సార్లు మొక్కలు బాగా తడిచేలా పిచికారీ చేయవలెను.

4) రైతు పేరు: గాజులపల్లె నానిరెడ్డి, గ్రామం: మందలపల్లె, మండలం: దుత్తలూరు, జిల్లా: ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు, ఫోన్ నెం: 9441136076.

**ప్ర: జామ తోటలో కలుపు ఉంది. నివారణ తెలపండి ?**

జ: జామ తోటలో కలుపు నివారణకు మొక్కల మధ్య మరియు సాళ్ళ మధ్య సాధ్యమైనంత వరకు ట్రాక్టరు ద్వారా లేదా పవర్ టిల్లర్ ద్వారా అంతర సేద్యం చేసుకోవాలి. మొక్కల పాదుల్లో మనుషులు ద్వారా కలుపు తీసుకోవాలి. కుదరని పక్షంలో ఆచ్ఛాదన ద్వారా కలుపు మొక్కల పెరుగుదలను నివారించు కోవచ్చును.

5) రైతు పేరు: డి. గుణశేఖరరెడ్డి, గ్రామం : చిన్న వేపంజేరి, మండలం : గంగాధర నెల్లూరు, జిల్లా : చిత్తూరు, ఫోన్ నెం: 9652582483.

**ప్ర: మామిడిలో కాయలపై నల్లటి మచ్చలు ఏర్పడుతున్నాయి, నివారణ తెలపండి?**

జ: మామిడిలో పక్షికన్ను మరియు కాడ తొడిమ కుళ్ళు తెగులు నివారణకు కార్బండిజమ్ 1 గ్రా. లేదా క్లోరోథలోనిల్ 2 గ్రా. లేదా థయోఫనేట్ మిథైల్ 1 గ్రా. లేదా టెబ్యుకొనజోల్ + ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 1 గ్రా. మరియు జిగురు పదార్థం 0.5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి 7 రోజుల వ్యవధితో 3 సార్లు పిచికారీ చేసుకోవాలి.

6) రైతు పేరు: బింగి రాజశేఖర్, గ్రామం: గోశానపల్లె, మండలం: డోన్, జిల్లా: నంద్యాల, ఫోన్ నెం: 9494735961.

**ప్ర: బంతిలో రసంపీల్చే పురుగు మందులు, శిలీంద్రనాశినులు మరియు మెగ్నీషియం సల్ఫేట్ ను పిచికారీ చేశాను. ఆకుల అంచులు మరియు పూలు మాడిపోతున్నాయి. ఏమి చేయాలో సలహా ఇవ్వగలరు?**

జ: బంతిలో వివిధ రసాయన మందులు కలిపి ఒకేసారి పిచికారీ చేయడం వలన ఇటువంటి ప్రభావాన్ని గమనించవచ్చు. సవరణకు ముందుగా ఎక్కువ పరిమాణంలో శుభ్రమైన మంచి నీటితో బంతి మొక్కలు బాగా తడిచేలా ఉదయం లేదా సాయంత్రం వేళల్లో 2-3 సార్లు పిచికారీ చేసుకోవాలి. పొటాషియం నైట్రేట్ 5 గ్రా. లేదా యూరియా 2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి 5 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

7) రైతు పేరు: సింగీతల భాస్కరరెడ్డి, గ్రామం: బెల్లంమాడుగు, మండలం: బైరెడ్డిపల్లె, జిల్లా: చిత్తూరు, ఫోన్ నెం: 9502045618.

**ప్ర: టమాటలో ఆకులు పెళుసుబారుతున్నాయి, నివారణ తెలపండి ?**

జ: టమాటలో సున్నం (కాల్షియం) సవరణకు కాల్షియం నైట్రేట్ 10 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి 7 రోజుల వ్యవధితో 4 సార్లు పిచికారీ చేసుకోవాలి. లేదా డ్రిప్ ద్వారా ఇస్తున్నట్లైతే కాల్షియం నైట్రేట్ 12 కిలోలను 4 భాగాలుగా చేసుకొని ఫెర్టిగేషన్ ట్యాంక్ లో కలుపుకొని వారం రోజుల వ్యవధితో అందించాలి.

8) రైతు పేరు: మన్నే నాగేశ్వరరెడ్డి, గ్రామం: ధర్మవరం, మండలం: డోన్, జిల్లా: నంద్యాల, ఫోన్ నెం: 9440507101.

**ప్ర: బొప్పాయిలో ఆకులు పండుబారి, ఎండి రాలిపోతున్నాయి, నివారణ తెలపండి ?**

జ: బొప్పాయిలో ఆకు మచ్చ తెగులు నివారణకు క్లోరోథలోనిల్ 2 గ్రా. మరియు జిగురు పదార్థం 0.5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

# సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు - సమాధానాలు

83310 56028
83310 56149
83310 56150
83310 56152
83310 56153
83310 56154



1. ప్రభాకర్, గ్రామం: కిరికెర, మండలం: హిందూపూర్, జిల్లా: శ్రీసత్యసాయి. ఫోన్: 8099088252

**ప్ర: టమాట పంటలో ఆకులను పురుగు తొలుస్తోంది. తెల్లని వలయాలు ఏర్పడుతున్నాయి. నివారణ తెలియజేయగలరు?**

జ: టమాటలో ఆకుతొలుచు పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



2. రైతుపేరు: డి. గాంధి, గ్రామం : అశోక్ నగర్, మండలం: వరికుంటపాడు, జిల్లా: ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు. ఫోన్ : 9949894252

**ప్ర: వేరుశనగలో పేనుబంక ఆశించింది. నివారణ చెప్పగలరు?**

జ: వేరుశనగలో పేనుబంక నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా థయోక్లోప్రిడ్ 0.25 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.



3. రైతుపేరు: పాండురంగారావు, గ్రామం : శేరిపాలెం, మండలం: మొగల్తూర్, జిల్లా: పశ్చిమ గోదావరి. ఫోన్: 9110340965

**ప్ర: కొబ్బరిలో ఆకులపై తెల్లని వలయాలలో తెల్లదోమ ఆశించినది. నివారణ తెలుపగలరు?**

జ: కొబ్బరిలో సర్పిలాకార తెల్లదోమ నివారణకు వేప నూనె (10000 పి.పి.ఎం.) 1 మి.లీ మరియు సర్ఫ్ 10 గ్రా. చొప్పున లీటరు నీటికి కలుపుకొని ఆకుల అడుగు భాగం పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి. ఎటువంటి క్రిమి సంహారక మందులు తోటలలో పిచికారి చేయరాదు.



4. షేక్ అమీర్ బాషా, గ్రామం : మొగల్లూరు, మండలం: పొదలకూరు, జిల్లా: నెల్లూరు. ఫోన్ : 9440423079

**ప్ర: నిమ్మలో వేరుపురుగులు ఆశించినవి, నివారణ తెలపండి ?**

జ: నిమ్మలో వేరుపురుగు నివారణకు ప్రతి మొక్కకు మరియు చుట్టూ ఉన్న మొక్కలకు నూనె తీయని వేప పిండి 2 కిలోలు మరియు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 40 గ్రా. చొప్పున మొక్క మొదలు వద్ద 10 సెం.మీ. లోతులో పాదు చుట్టూ వేసి మట్టి కప్పి తేలికగా నీరు పెట్టాలి.



5. రైతుపేరు: బింగి చంద్రమోహన్, గ్రామం : గోశానపల్లె, మండలం: డోన్, జిల్లా: నంద్యాల. ఫోన్ : 9491118604.

**ప్ర: వంగలో ఆకుల అడుగు భాగంలో రసం పీల్చే పురుగులు ఆశించినవి, నివారణ తెలపండి ?**

జ: వంగలో పచ్చదోమ నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. చొప్పున లీటరు నీటితో కలిపి వారం రోజుల వ్యవధితో పిచికారీ చేసుకోవాలి.

6. రైతుపేరు: శ్రీధర్, గ్రామం : నడిమూరు, మండలం: యాదమర్రి, జిల్లా: చిత్తూరు. ఫోన్: 9000534571



ప్ర: మామిడి పండ్లపై మంగు ఏర్పడుతున్నది. నివారణ చెప్పగలరు?

జ: మామిడిలో తేనె మంచు పురుగులు ఆశించడం వలన ఏర్పడ్డ మంగు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ., కార్బండిజమ్ 1 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి మంచులా పడే విధముగా పిచికారీ చేసుకోవాలి.



7. రైతుపేరు: షేక్ అమీర్ బాషా, గ్రామం: మొగల్లూరు, మండలం: పొదలకూరు, జిల్లా: నెల్లూరు. ఫోన్ : 9440423079

ప్ర: ప్రత్తిలో ఆకులు ఎర్రగా మారుతున్నాయి. నివారణ తెలపండి ?

జ: ప్రత్తిలో మెగ్నీషియం ధాతు లోపం సవరణకు మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి మొక్కలు పూర్తిగా తడిచేటట్లుగా 5 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

8. రైతుపేరు: ఎస్.చిన్న అల్లూరి రెడ్డి, గ్రామం : గడ్డమీదపల్లి, మండలం: సీతారామపురం, జిల్లా: నెల్లూరు. ఫోన్ : 9533143878



ప్ర: వరి వెన్నులలో తాలు గింజలు ఏర్పడుతున్నాయి. నివారణ చెప్పగలరు?

జ: వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరాంత్రనిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



9. రైతు పేరు: శరత్, గ్రామం : బోనాల, మండలం: లింగాల, జిల్లా: వై.ఎస్.ఆర్. కడప. ఫోన్ : 7330973351

ప్ర: చీని పంటలో ఎగిరే పేను లేత కొమ్మల చిగుర్లపై గుంపులుగా ఉన్నాయి. నివారణకు ఏమి పిచికారీ చేయాలి?

జ: చీని పంటలో ఎగిరే పేను నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా థయోమిథాక్సమ్ 0.3 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి వారం వ్యవధితో రెండు సార్లు కొత్త చిగుర్లు వచ్చేటప్పుడు లేదా కొమ్మలపై పురుగు గమనించిన వెంటనే పిచికారీ చేయాలి.

10. రైతుపేరు: విప్పర్ల రామయ్య, గ్రామం : భూమనపల్లె, మండలం: దొనకొండ, జిల్లా: ప్రకాశం. ఫోన్ : 9398608828



ప్ర: బొప్పాయిలో కాయలపై పిండినల్లి ఆశించినవి, నివారణ తెలపండి ?

జ: బొప్పాయిలో పిండినల్లి నివారణకు అజాడిరక్టిన్ (3000 పి.పి.ఎం.) 3 మి.లీ. ఆతరువాత 5 రోజులకు ప్రొఫినోఫాస్ 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. మరియు జిగురు పదార్థం 0.5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలుపుకొని 7 రోజుల వ్యవధితో 2-3 సార్లు పిచికారీ చేసుకోవాలి.

# సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు

1) రైతు పేరు: సురేష్, గ్రామం : కదిరి, మండలం: కదిరి, జిల్లా: శ్రీసత్యసాయి, ఫోన్ నెంబర్: 9701601355.

**ప్ర: వేరుశనగ పంట వేయాలి అనుకుంటున్నాను. విత్తే సమయం మరియు మేలైన రకాలను తెలుపగలరు?**

జ: వేరుశనగ పంటను ఉత్తరకోస్తా ప్రాంతంలో జూన్ మరియు జూలై నెలల్లో మరియు రాయల సీమ ప్రాంతంలో జూలై నుండి ఆగష్టు 15 వరకు విత్తుకోవడం మంచిది. కదిరి 6, కదిరి 9, కదిరి లేపాక్షి, ధరణి, నారాయణి రకాలు మేలైనవి.



2) రైతు పేరు: సుదేష్, గ్రామం: గుడిబండ, మండలం: గుడిబండ, జిల్లా: శ్రీ సత్యసాయి, ఫోన్ నెంబర్: 7671831669.

**ప్ర: మొక్కజొన్న విత్తి 20 రోజులు అయ్యింది. కలుపు నివారణకు ఏమి పిచికారీ చేయాలో తెలపండి?**

జ: మొక్కజొన్న పంటలో కలుపు నివారణకు టెంబోట్రియోన్ 115 మి.లీ + అట్రాజిన్ 400 గ్రా. చొప్పున ఎకరానికి 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

3) రైతు పేరు: రాజేష్ కుమార్, గ్రామం: ఉరవకొండ, మండలం: అనంతపురం, జిల్లా: అనంతపురం, ఫోన్ నెంబర్: 9704595061.

**ప్ర: ఆముదం పంట వేయాలి అనుకుంటున్నాను, బెట్ట పరిస్థితులను తట్టుకొనే రకాలు చెప్పగలరు ?**

జ: ఆముదంలో డి.సి.హెచ్. 177 మరియు ఐ.సి.హెచ్. 66 అనే సంకర రకాలు బెట్టను మరియు ఎండు తెగులును తట్టుకుంటాయి. సూటి రకం కిరణ్ బోడికాయల వల్ల బూజు తెగులును మరియు బెట్టను తట్టుకుంటుంది.

4) రైతు పేరు: యం.నారాయణ, గ్రామం: రాపర్తి, మండలం: పిఠాపురం, జిల్లా: కాకినాడ, ఫోన్ నెంబర్: 9866603818.

**ప్ర: మినుము పంటలో ఆకులు పసుపు రంగులోకి మారుతున్నాయి, నివారణ తెలపండి ?**

జ: మినుములో పల్లాకు తెగులును వ్యాప్తి చేసే తెల్లదోమ నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

5) రైతు పేరు: రాధా స్వామి, గ్రామం : పాతూరు, మండలం: విడపనకల్లు, జిల్లా: అనంతపురం, ఫోన్ నెంబర్: 8008946165.

**ప్ర: నేరేడులో కాయలు రాలిపోతున్నాయి. నివారణ తెలపండి?**

జ: నేరేడులో కాయలు రాలకుండా నివారించుటకు జిబ్బరెల్లిక్ యాసిడ్ 6 గ్రా. చొప్పున 100 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

6) రైతు పేరు: కొమ్మా తిరుమల ప్రసాదు, గ్రామం: బొజ్జివారిపల్లె, మండలం: రైల్వే కోడూరు, జిల్లా: అన్నమయ్య, ఫోన్ నెం: 9959870619.

**ప్ర: గోంగూరలో ఆకు తినే పురుగులు ఆశించినవి. ఏమి పిచికారీ చేయాలో తెలుపగలరు?**

జ: గోంగూరలో ఆకు తినే పురుగు నివారణకు అజాడిరక్టిన్ (3000 పి.పి.ఎం.) 3 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

7) రైతు పేరు: గంటే వేణుగోపాల్, గ్రామం: గోశానపల్లె, మండలం: డోన్, జిల్లా: నంద్యాల, ఫోన్ నెం: 9494802021.

**ప్ర: చిక్కుడులో పూత తినే పురుగులు ఆశించినవి, నివారణ చెప్పగలరు?**

జ: చిక్కుడులో పూత తినే పురుగు నివారణకు ఫ్లూబెండమైడ్ 0.3 మి.లీ. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.



8) రైతు పేరు: మీరావత్తు నాగార్జున, గ్రామం: ఎలగలవంక, మండలం: బెళుగుప్ప, జిల్లా: అనంతపురం, ఫోన్ నెం: 9000057066.

**ప్ర: ఖర్బూజలో ఆకుల అడుగు భాగంలో రసం పీల్చే పురుగులు ఆశించినవి. నివారణ చెప్పండి ?**

జ: ఖర్బూజలో తెల్లదోమ మరియు పచ్చదోమ నివారణకు థయోమిథాక్సామ్ 0.2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పసుపు మరియు నీలి రంగు జిగురు అట్టలు ఎకరానికి 20 చొప్పున అమర్చుకోవాలి.




# రైతుల స్పందన

నువ్వుల పంటలో పేనుబంక నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. పురుగు ఉధృతి చాలా వరకు తగ్గింది. సలహా ఇచ్చిన రైతు సమాచార కేంద్రం వారికి నా కృతజ్ఞతలు.

వై. నాగయ్య
ఈదర గ్రా., ముండ్లమూరు మం., ప్రకాశం జిల్లా,
ఫోన్ : 9948507028.

బెండ పంటలో కాయతొలుచు పురుగు నివారణకు ఐ.సి.సి. సిబ్బంది సలహా మేరకు ప్రొఫెనోఫాస్ 2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి మొక్కలు తడిచేటట్టు పిచికారీ చేశాను. పురుగు ఉధృతి చాలా వరకు తగ్గింది. ఐ.సి.సి కి ధన్యవాదాలు.

జి. వి. వెంకట సత్యనారాయణ
రాజగోపాలపట్నం,
పెద్దాపురం మం.,
కాకినాడ జిల్లా. ఫోన్ : 9666748100.

ప్రత్తి పంటలో బెట్ట పరిస్థితిని తట్టుకోవడానికి పొటాషియం నైట్రేట్ 10 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. పంట బాగుంది. రైతు సమాచార కేంద్రం సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

షేక్ ఖాదర్ బాషా
బ్రహ్మసముద్రం,
కణేకల్లు మం.,
అనంతపురం జిల్లా, ఫోన్ : 9704425265.

సమీకృత రైతు సమాచార కేంద్రం వారు ఇచ్చిన సలహా ప్రకారం కిలో వేరుశనగ విత్తనానికి 1 గ్రా. టెబ్యుకొనజోల్ మరియు 2 గ్రా. ఇమిడాక్లోప్రిడ్ చొప్పున కలిపి విత్తనశుద్ధి చేసి నాటాను. ఇంతవరకు ఎటువంటి పురుగులు తెగుళ్ళు లేకుండా పంట బాగుంది. వారికి నా అభినందనలు.

శివా రెడ్డి,
పెమ్మడ గ్రా.,
రాయచోటి మం.,
వై.ఎస్.ఆర్. జిల్లా ఫోన్ : 8790565879

మిర్చిలో నల్లతామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. మరియు అజాడిరక్టిన్ (10000 పి.పి.ఎం.) 1 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. పురుగు ఉధృతి చాలా వరకు తగ్గింది. ఐ.సి.సి సిబ్బందికి నా ధన్యవాదాలు.

ఎర్రన్న
సులకేరి,
కౌతాళం మం.,
కర్నూలు జిల్లా,
ఫోన్ : 9908301001.

ఐ.సి.సి వారు చెప్పినట్టు మామిడిలో టెంక పురుగు నివారణకు ఫెంతియాన్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేశాను. ఇతర పండ్లలో ఈ లక్షణాలు కనిపించలేదు. పంట బాగుంది. కృతజ్ఞతలు.

బింగి వరుణ్
గోసానపల్లె గ్రా.,
డోన్ మం., నంద్యాల,
ఫోన్ : 9494142907.

## జూన్ నెల విజేత

**కర్నూలు జిల్లా వ్యవసాయాధికారి ప్రథమం**

2023 మే నెలకు గాను రాష్ట్రం లోని 26 జిల్లాల్లో
కర్నూలు జిల్లా వ్యవసాయాధికారి

**పి. లలితా వరలక్ష్మి**

ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లా వ్యవసాయాధికారికి ఉన్నతాధికారులు, సహచరులు అభినందనలు తెలిపారు.

కాకినాడ జిల్లా వ్యవసాయాధికారి, **ఎన్. విజయ్‌కుమార్** ద్వితీయ స్థానంలో నిలిచారు.



**పి. లలితా వరలక్ష్మి**
కర్నూలు జిల్లా వ్యవసాయాధికారి

## ఉత్తమ సేవలందిస్తున్న ఆర్.బి.కె. సిబ్బంది



**కె. అనిల్ కుమార్**
జొడేరు, గంగవరం మం., అల్లూరి సీతారామరాజు



**బి.హర్ష అప్పారావు,**
బాట జంగాల పాలెం, సబ్బవరం, అనకాపల్లి



**ఎం.కృష్ణవేణి,**
ఒంటిమిద్దె, కళ్యాణదుర్గం, అనంతపురం



**ఎం. సమీనా,**
సంగసముద్రం, గుర్రంకొండ అన్నమయ్య



**శేషారావు,**
అద్దంకి (అ), అద్దంకి, బాపట్ల



**బి. నాగలక్ష్మి,**
ఉండ్రాజవరం, వేలివెన్ను, తూర్పు గోదావరి



**టి. తులసి,**
కుక్కలపల్లి, యాదమర్రి, చిత్తూరు



**యు.సోనియా,**
జంగారెడ్డిగూడెం, జంగారెడ్డి గూడెం, ఏలూరు,



**ఎస్.క్షేత్రపాల్,**
భల్లుకవారిపాలెం, కాకుమాను, గుంటూరు



**బ్రహ్మనాయుడు,**
ఎస్.అన్నవరం1, తుని, కాకినాడ



**బి.షరోని,**
పసలపూడి, రాయవరం, కోనసీమ



**వి.సాయికుమార్,**
బేతవోలు, గుడివాడ, కృష్ణా



**ఎ.సుమతి,**
గూడూరు, గూడూరు, కర్నూలు



**పి. మాణిక్యరాణి,**
అహోబిలం, ఆళ్లగడ్డ, నంద్యాల



**ఎస్.అన్నపూర్ణదేవి,**
పొందుగల, మైలవరం, ఎన్.టి.ఆర్.



**జి.ప్రతాప్ కుమార్,**
మాచర్ల, మాచర్ల, పల్నాడు.



**కె.భారతి,**
వీరఘట్టం, వీరఘట్టం పార్వతీపురం మన్యం



**జి.ప్రేమకుమారి,**
దర్శి, దర్శి, ప్రకాశం



**ఒ. సుభాషిణి,**
బుడంగుంట, కావలి, నెల్లూరు



**వి.వెంకటేష్ నాయక్,**
గరిమేకలపల్లి , రామగిరి, శ్రీ సత్యసాయి



**జి.పవిత్ర,**
పిచ్చాటూరు, కరూరు , తిరుపతి.



**జి.స్రవంతి,**
భీమునిపట్నం, భీమిలి, విశాఖపట్నం



**డి. పుణ్యవతి,**
గొల్లపల్లి, బొబ్బిలి, విజయనగరం



**ఎస్.ధర్మరాజు,**
ఆకివీడు4, ఆకివీడు, పశ్చిమ గోదావరి.



**ఆర్. బేబీ,**
ఎన్.మైదుకూరు, మైదుకూరు, వైఎస్ఆర్.



**ఎస్. శివ,**
కింతలి, పొందూరు, శ్రీకాకుళం

# ట్రాక్టర్ ఉత్తమ పనితీరుకు ఇవీ చిట్కాలు..!

- ఎక్కువ పవర్, తక్కువ బరువు ఉన్న ట్రాక్టర్ అయితే నేల కుంగుబాటు తగ్గుతుంది. అలాగే ముందుకు కదలడానికి తక్కువ బలం అవసరమవుతుంది. (ఎక్కువ బరువుంటే పనితీరు బాగుంటుదనేది అపోహ మాత్రమే).
- పెద్ద గేర్లు వాడడం వల్ల వేగం పెరుగుతుంది. ఆక్సిలేటర్ తగ్గించడం వల్ల ఇంజిన్ వేగం తగ్గి లాగుడు బలం మెరుగయి, డీజిల్ వినియోగం తగ్గుతుంది. దీనివల్ల ట్రాక్టర్ వేగం పెరగడం తో పాటు లాగుడు బలం పెరిగి నిర్దేశించిన పని తక్కువ సమయం, డీజిల్ తో ముగుస్తుంది.
- వెనుక టైర్లు ఎక్కువ వ్యాసం, వెడల్పు ఉండేలా ఎంచుకోవాలి. తగినంత గాలి పీడనం ఉండేలా చూసుకోవాలి. టైర్ల పైన దారాలు అరిగిపోతే మళ్ళీ వేయించుకోవాలి.
- ట్రాక్టర్ పవర్, మట్టి రకం బట్టి పనిముట్టు సైజు ఎంచుకోవాలి. 30-35 హెచ్.పి ట్రాక్టర్ 9 లేదా 11 పలకల కల్టివేటర్‌ను వాడాలి. 1.3 లేదా1.4 గేర్, అలాగే 2 పలకల రెక్కల నాగలిని, 1.2 గేర్ వద్ద వినియోగించాలి.
- ఇసుక నేలలో వాడినప్పుడు చక్రాల గాలి పీడనం తక్కువ ఉండేలా చూసుకోవాలి. అలాగే ట్రాక్టర్ కు బరువులు తగిలించరాదు.
- సాధారణంగా 2 wd ట్రాక్టర్లో 30-35% బరువును ముందు భాగంలో, 65-70% బరువు వెనుక భాగంలో ఉంచుతారు. అందువల్ల వీల్ స్లిప్ 10-15% తప్పనిసరిగా ఉండాలి. ఒకవేళ అది మించితే వెనుక చక్రాలకు బరువులు తగిలించాలి. ఒకవేళ స్లిప్ 6-7% కన్నా తక్కువగా ఉన్నా తగిలించిన బరువు తగ్గించాలి.
- ఇంజిన్, ఇతర భాగాలను తరచుగా సరిచూసుకోవాలి. ఎయిర్ క్లీనర్ శుభ్రపరచాలి. రేడియేటర్ మూత సరిగా లేకపోతే సమస్యలు వస్తాయి. పొలం పనులు పూర్తయిన తరువాత ట్రాక్టర్ ను శుభ్రంగా కడిగి, ఆయిల్ తో తుడవాలి.

**డా. ఎ. అశోక్ కుమార్**
డా. ఎన్.టి.ఆర్. వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల,
బాపట్ల

